

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా

సంపుటి : 7 సంచిక : 285 గురువారం 17- 09 - 2026 ఎడిటర్ : బరిగెల శివ ■ పేజీలు : 8 ■ వెల : 5.00

పబ్లిషర్స్ : తెలంగాణ హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూర్, తమిళనాడు చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పంజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్











# చూడ చక్కని.. సంస్కరణలకు సూత్రధారులు..!

- భక్తిత్వం పేరు మీద భారతదేశాన్ని బజారునకేడుస్తున్నారు.
- నిరూపయోగ సంస్కరణలతో దేశాన్ని పాడు చేస్తున్నారు.
- ఉత్తపచ్చి ఆచరణలను సంస్కరణలుగా మారుస్తున్నారు.
- నిజమైన పూజలకు దైవభక్తికి తేడా లేకుండా పోతుంది.
- దేశంలో కొనసాగుతున్న ఆచరణలు వ్యక్తిగతమా బలవంతమా.
- పేద ప్రజల జీవనానికి ఉపయోగపడే సంస్కరణలు ఎక్కడ.
- దేశం ఏమైపోయినా పర్వాలేదా.
- వ్యక్తిత్వం చంపుకొని రాజకీయాలు చేయడం కొత్త సంస్కరణ.
- ప్రజల జీవితాలను ఆగం చేయడం దేశ పాలననా.
- భజన పరుల భక్తి దేవుళ్లపైననా మనుషులపైననా.
- డాక్టర్ బరిగెల శివ.

**హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)**

దేశంలో కొత్త రకమైన సంస్కరణలు కొలువితీరుతున్నాయని డాక్టర్ బరిగెల శివ పేర్కొన్నారు.మునుపటి కాలంలో దేశం కోసం దేశ రక్షణ కోసం దేశ ప్రజల బాగోగుల కోసం సంస్కరణలు ఏర్పాటు చేయబడి చట్టం రూపంలో ప్రజలకు అందుబాటులోకి వచ్చేవని గుర్తు చేశారు.ప్రస్తుతం దేశంలో నూతనమైన సంస్కరణలు రాజకీయ నాయకులకు అనుగుణంగా వ్యక్తిగత స్వార్థంతో ఏర్పాటు చేయబడుతున్నాయని వాటి వల్ల ప్రజలకు గాని భారతదేశానికి గాని ఎలాంటి ఉపయోగం లేదని తీవ్రంగా విమర్శించారు.చట్ట సవరణలకు చట్ట సంస్కరణలకు విరుద్ధంగా దేశ పాలనను కొనసాగించడం నూతనమైన సంస్కరణగా రాజకీయ నాయకులు భావిస్తున్నట్లు రాజకీయ విశ్లేషకులు తీవ్రస్థాయిలో అనుమానాలు వ్యక్తం చేస్తున్నారన్నారు.ప్రజలను ఆదుకోవాల్సిన ప్రభుత్వాలు ప్రజల జీవితాలను ఆగం చేసే సంస్కరణలు ఏర్పాటు చేసుకుంటూ ప్రజల జీవితాలతో వ్యాపారాలు చేస్తున్నారని తీవ్రంగా మండిపడ్డారు.ప్రజలను వేధించడం కొత్తరకమైన సంస్కరణగా రాజకీయ పాలకులు వాళ్ళ వ్యక్తిగత అభిప్రాయాలను,వ్యక్తిగత స్వార్థాలను దేశంపై రుద్దుతున్నట్లు ప్రజలు చిదరించుకుంటున్నారన్నారు.చూడ చక్కని సంస్కరణలో 12 సంవత్సరాల భారతదేశ పరిపాలన కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధివిధానాలు దేశ ప్రజలను ఎంతటి దీనమైన స్థితిలోనికి నెట్టివేస్తున్నాయో పాలకులు అర్థం కాలేక కాకుండా కావాలనే చేస్తున్నట్లుగా స్పష్టంగా కనిపిస్తుంది అన్నారు.దేశ ప్రజలను బాధలు పెట్టుకుంటూనే దేశంలో అడ్డగోలుగా నిర్బంధ సంస్కరణలను అమలుపరచుకుంటున్నారని ఉద్యమకారుల జాడ లేకుండా చేయడం కోసం ప్రతి రాష్ట్రంలో అణిచివేత అనేది పెద్ద స్థాయిలో పెరిగిపోయిందని రాజకీయ నాయకులను ప్రశ్నిస్తే దాడులు చేయించే సంస్కృతి సంస్కరణలుగా మారిపోయి నిజమైన రాజ్యాంగ సంస్కరణలకు విరుద్ధమైన పరిపాలన నడుస్తున్నందుకు దేశ ప్రజలు సిగ్గుతో తలవంచుకుంటున్నారని అన్నారు.రాజకీయ నాయకుల తలపొగరు పాలన దేశాన్ని అగమ్య గోచరంగా మారుస్తుందని బాధపడ్డారు.ప్రజల జీవన విధానాలను అభివృద్ధి పరచాల్సిన దేశపాలకులు ప్రజా వ్యతిరేక విధానాలను సంస్కరణలుగా మార్చుకొని 140 కోట్ల జనాభాను తెగతిప్పల పెడుతున్నారని మండిపడ్డారు.రాజ్యాంగానికి విరుద్ధమైన పనులు చేసుకుంటూ వేల కోట్ల రూపాయలను దుబారా ఖర్చులకు వాడుతూ ప్రభుత్వానికి గాని ప్రజలకు గాని అధికార వ్యవస్థలకు గాని లెక్కలు చూపకుండా కొత్తరకమైన దోపిడిని ప్రదర్శిస్తూ దానిని వ్యక్తిగత స్వార్థపూరితమైన సంస్కరణగా మార్చుకొని దేశంలో అమలుపరచుకుంటూ తిరుగులేని నాయకులుగా చలామణి కొనసాగిస్తున్నారని బాధపడ్డారు.దేశంలోని ఉద్యమకారులను ఎక్కడకక్కడే అరెస్టులు చేస్తూ వాళ్ళ కుటుంబాలపై మానసికమైన దాడులను కొనసాగిస్తూనే ఉద్యమాలు చేయాలంటేనే, నాయకులను ప్రశ్నించాలంటేనే భయపడే స్థాయికి అణిచివేత సంస్కరణను చూడ చక్కగా అమలుపరుస్తున్నారని ఎద్దేవా చేశారు.

**దైవాధీనంలో లేని దాడుల సంస్కరణ.**

ఈ మధ్యకాలంలో దేశంలో పెద్ద ఎత్తున దాడులు జరుగుతున్నాయని కులాల ప్రాతిపదికన మతాల ప్రాతిపదికన జరుగుతున్న దాడుల విధ్వంసకు దేశపాలకుల కారణమంటూ వాటన్నిటిపై ప్రపంచ దేశాలన్నీ చివాట్లు పెడుతున్నప్పటికిని దేశ పాలకుల పద్ధతిని మార్చుకోకుండా దాడులను అన్నిటిని దైవాదినాల్లోకి తీసుకువస్తున్నారని మండపడ్డారు. రాజ్యాంగ సంస్కరణలకు విరుద్ధంగా వ్యక్తిగత సంస్కరణలు ఏర్పాటు చేసుకోవడం ఏ రాజకీయ చట్టంలో ఉందో తెలియదు గానీ దైవభక్తి పేరుమీద మనుషులను చంపడం దైవభక్తి పేరుమీద మహిళలను రేపులు చేయడం దైవభక్తి పేరు మీద మైనర్లను వాడుకోవడం దేశంలో పైపెచ్చుగా పెరిగిపోవడం నిజమైన దేశ సంస్కృతి దెబ్బతింటుందని హెచ్చరించారు.ఆచరణలకు సాధ్యం కానీ హామీల పేరున ప్రభుత్వాలను ఏర్పరచుకోవడం కొత్త రకమైన సంస్కృతిగా దేశ ప్రజలు భావిస్తున్నారంటూ తెలుపుతూ అధికారం అనేది దౌర్జన్యపు సొత్తు లాగా భావించుకుంటూ పాలకులు ఆదిపత్య పోరు కోసం లెక్కలేనన్ని దగుల్బాజీ పనులు చేయడం దేశ సంస్కరణగా కొనసాగిస్తున్నట్లుగా రాజకీయ విశ్లేషకులు తీవ్రంగా విమర్శిస్తున్నారు అన్నారు.దైవభక్తికి, వ్యక్తిగత విశ్వాసానికి రాజకీయాన్ని జోడించడం ప్రపంచ దేశాల్లో ఎక్కడా లేని కొత్త సంస్కృతి దేశంలో కొనసాగుతుందని మండిపడ్డారు.గతంలో ప్రజలకు సౌకర్యవంతమైన సంస్కరణలను అందుబాటులోనికి తీసుకొచ్చి ప్రజల వైపు నిలబడే చట్టాలను న్యాయస్థానాలను అధికార యంత్రంగాలను ప్రభుత్వాలను చూసాము గాని ప్రస్తుతం దేశంలో అలాంటి పరిస్థితులు కనుసైగా మేరకైనా కనిపించకపోవడం బాధాకరమన్నారు. భగవంతుడి ఆలయంలోని సొమ్మును కూడా దర్జాగా దొంగతనాలు చేసే మహాత్తరకమైన సంస్కృతిని దేశంలో ప్రవేశపెట్టిన అపర మేధావులకు పుణ్యం కలుగుతుందో గౌరవం దక్కుతుందో తెలియదు గానీ దొంగతనాన్ని కూడా బహిరంగంగా ప్రకటించుకునే విచ్చలవిడి సంస్కృతి దేశంలో ఏర్పడడం జాతీయవాదాన్ని కనుమరుగు చేయడమేనని ప్రత్యేకించి చెప్పారు.దైవభక్తి దేవునిపై మాత్రమే కొనసాగించాల్సింది పోయి నాయకులపై కొనసాగించే మరో కొత్త రకమైన సంస్కరణ దేశం పట్ల ఏర్పడడం బహుళ సిగ్గుకరమన్నారు.మనిషి బ్రతికుండగానే దీపాలు వెలిగించడం మనిషి బ్రతికుండగానే దేవుని.. మిగతా 2లో..

## రుణాల మంజూరుపై బ్యాంకులు దృష్టి పెట్టాలి

**అమరావతి, 16 సెప్టెంబర్, (జై భీమ్ న్యూస్)**




రాష్ట్రంలోని అన్ని రంగాలు, అన్ని వర్గాలను బలోపేతం చేసేలా బ్యాంకులు విస్తృతంగా రుణాలు అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. 236వ రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్ఎల్బీసీ) సమావేశంలో బ్యాంకర్లు, అధికారులకు ఆయన దిశానిర్దేశం చేశారు. రుణాల లక్ష్యాలను చేరుకున్నప్పుడే ఎస్ఎల్బీసీ సమావేశాల నిర్వహణకు సార్థకత ఉంటుందని పేర్కొన్నారు. ఎంఎస్ఎంఈలకు గతంతో పోలిస్తే ఈసారి రుణాల మొత్తం పెరిగినప్పటికీ.. ఆశించిన స్థాయిలో రుణాల మంజూరు జరగలేదని చంద్రబాబు అన్నారు. కొన్ని బ్యాంకులు రుణాల మంజూరులో చాలా వెనుకబడి ఉన్నాయని పేర్కొంటూ.. నిర్దేశించిన లక్ష్యాలను చేరుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రధానమంత్రి సూర్యఘర్ పథకంలో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అగ్రస్థానంలో నిలపాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని చంద్రబాబు తెలిపారు. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు బ్యాంకులు పెద్దఎత్తున రుణాలు మంజూరు చేయాలని కోరారు. రాష్ట్రంలో 15 శాతం ఆర్థిక వృద్ధిని సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ ఎల్‌నినో కారణంగా ప్రతికూల పరిస్థితులు ఏర్పడ్డాయని చెప్పారు. వాటిని అధిగమించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కౌలు రైతులకు కూడా సమృద్ధిగా రుణాలు అందేలా.. మిగతా 4లో..

## 22ఏ నిషేధిత జాబితా వివాదాలకు పరిష్కారం

- నిరుపేదల ఆస్తులకు 30 రోజుల్లో న్యాయం
- 22ఏ సమస్యల పరిష్కారానికి హైపవర్ కమిటీ..
- 12 కీలక అంశాలపై ప్రభుత్వం నిర్ణయాలు

**హైదరాబాద్, 16 సెప్టెంబర్, (జై భీమ్ న్యూస్)**



రాష్ట్రంలో 22ఏ నిషేధిత జాబితాలో ఉన్న నిరుపేదలకు సంబంధించిన ఆస్తుల వివాదాలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి శాసన సభలో ప్రకటించారు. న్యాయబద్ధమైన, అర్హత కలిగిన కేసుల్లో పేదలకు అన్యాయం జరగకుండా నిర్ణయాలు తీసుకుంటామని స్పష్టం చేశారు. 22ఏ నిషేధిత జాబితా సమస్యల పరిష్కారానికి సీసీఎల్ఏ ప్రత్యేక కార్యదర్శి, న్యాయశాఖ కార్యదర్శి, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ శాఖ ఉన్నతాధికారితో కూడిన హైపవర్ అధికారుల కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. 22ఏ నిషేధిత జాబితాపై శాసనసభలో జరిగిన స్వల్పకాలిక చర్చకు ముఖ్యమంత్రి సుదీర్ఘంగా సమాధానమిచ్చారు. నిజాం కాలం నుంచి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ వరకు, అనంతరం తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి భూములకు సంబంధించిన చట్టాలు, వాటి పరిణామ క్రమాన్ని సభకు వివరించినట్లు తెలిపారు. న్యాయపరమైన అంశాలను పరిశీలించిన అనంతరం నిరుపేదలకు ఉపశమనం కలిగేలా అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు.ప్రభుత్వం ప్రధానంగా గుర్తించిన 12 రకాల భూ సమస్యలపై ప్రత్యేకంగా దృష్టి సారించనున్నట్లు వెల్లడించారు.

**1. అర్బన్ ల్యాండ్ సీలింగ్ భూములకు కొత్త విధానం**

అర్బన్ ల్యాండ్ సీలింగ్ (యూఎల్‌సీ) పరిధిలోని పాక్షికంగా క్రమబద్ధీకరించిన, క్రమబద్ధీకరించని కాలనీల సమస్యలను పరిష్కరించేందుకు కొత్త విధానాన్ని తీసుకురానున్నారు. యూఎల్‌సీ మిగులు భూముల క్రమబద్ధీకరణకు ఈ విధానం ఉపయోగపడుతుందని ప్రభుత్వం పేర్కొంది. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న పాత దరఖాస్తులతో పాటు కొత్తగా వచ్చే దరఖాస్తులకు కూడా ఈ పథకాన్ని వర్తింపజేయనున్నారు. భూముల రిజిస్ట్రేషన్, క్రమబద్ధీకరణ ప్రక్రియలను సమాంతరంగా చేపట్టే విధంగా చర్యలు తీసుకోనున్నారు.

**2. ఆమోదిత లేఅవుట్లలో ప్రభుత్వ భూముల సమస్య**

హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ, డీటీసీపీ వంటి సంబంధిత అధికార సంస్థలు ఆమోదించిన లేఅవుట్లలో ఉన్న ప్రభుత్వ భూములకు సంబంధించిన పెండింగ్ రిజిస్ట్రేషన్ దరఖాస్తులపై ప్రభుత్వం దృష్టి సారించనుంది.ఇలాంటి దరఖాస్తులను పరిశీలించి తగిన పరిష్కారం చూపేందుకు వారం రోజుల్లో సమగ్ర వ్యవస్థను ఏర్పాటు చేయనున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. అర్హత ఉన్న ఆస్తుల క్రమబద్ధీకరణను వేగంగా పూర్తి చేసేందుకు ప్రత్యేక విధానం తీసుకురానున్నట్లు వెల్లడించారు.

**3. సింగరేణి కోల్‌బెల్ట్ ప్రాంతాల సమస్యలకు కమిటీ**

సింగరేణి బొగ్గు గని ప్రాంతాల్లో భూములకు సంబంధించిన పెండింగ్ సమస్యల పరిష్కారానికి జిల్లా స్థాయి ఉన్నతాధికారుల కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు.. మిగతా 5లో..

## దివ్యాంగులకు'లా' అందుబాటులోకి రావాలి..!



- దివ్యాంగులకు ప్రత్యేకమైన న్యాయస్థానాలను ఏర్పాటు చేయాలి.
- దివ్యాంగులకు ప్రతి జిల్లాలో నూతన పోలీస్ స్టేషన్ నియమించాలి.
- దివ్యాంగుల సంక్షేమమే సర్వ సమస్యలకు పరిష్కార మార్గం.
- న్యాయపరమైన సంస్కరణలతోనే దివ్యాంగులకు మేలు చేకూర్చబడుతుంది.
- దివ్యాంగుల మేధస్సు రాజకీయాలను సైతం శాసించగలదు.
- దివ్యాంగులకు కొత్త రకమైన చట్టాలను రూపొందించాలి.
- దివ్యాంగుల రిజర్వేషన్లను తూచా తప్పకుండా అమలుపరచాలి.
- దివ్యాంగులను వేధిస్తే కఠినమైన చట్టం రూపంలో చర్యలు చేపట్టాలి.
- ప్రజాస్వామ్యానికి రక్షణ ప్రతిరూపాలు దివ్యాంగులే.
- సమాజ రక్షణలో దివ్యాంగుల మేధస్సు మహాద్భుతం.
- దివ్యాంగులకు మెండుగా రాజకీయపరమైన అవకాశాలు కల్పించాలి.
- ప్రభుత్వ నామినేటెడ్ పదవులతో ఉన్నతంగా గౌరవించాలి.
- దివ్యాంగులకు "లా"ను పరిపూర్ణ స్థితిలో అందుబాటులోనికి తీసుకురావాలి.
- డాక్టర్ బరిగెల శివ. పూర్తి వివరాలు 2లో..

# చూడ చక్కని సంస్కరణలకు సూత్రధారులు

మొదటి పేజీ తరువాయి

రూపంలో విగ్రహాలు తయారు చేయడం మనిషి బ్రతికుండగానే మతమనే ముసుగును బలవంతంగా రుద్దడం ఇవన్నీ ఏ దేశపు రాజకీయ సంస్కరణలో తెలియదు గాని భారత దేశంలో ఎప్పుడూ కనివిని ఎరుగని సంస్కరణలు చట్ట విరుద్ధంగా న్యాయవిరుద్ధంగా రాజకీయ విరుద్ధంగా రాజ్యాంగ విరుద్ధంగా మాత్రం బలవంతంగా కొనసాగుతున్నాయన్నది పచ్చినిజం అన్నారు. మహిళలను గౌరవించలేని మూర్ఖులకు దైవభక్తి అంటే ఏం తెలుస్తుంది అంటూ హెచ్చరించారు. ప్రతి కుటుంబంలో స్త్రీ ఉంటుందని స్త్రీ జాతిని అవమానపరిచే కొత్త రకపు సంస్కృతిని దేశంలో ప్రవేశపెట్టిన మూర్ఖుడు ఎవడంటూ సూటిగా నిలదీశారు. దేశ ప్రజల అభిప్రాయాలతో గాని అభిమతంతో గాని విశ్వాసంతో గాని సూచనలతో గాని సంబంధం లేకుండా రాజకీయ నాయకులకు నచ్చినట్లుగా బ్రతకాలని కొత్త రకమైన సంస్కృతిని 140 కోట్ల ప్రజలపై రుద్దడమే కాకుండా బలవంతపు దాడులు చేస్తూ రాజకీయ నాయకులకు నచ్చినట్లుగా బ్రతకకపోతే ఈ దేశంలో జీవించడానికి వీల్లేదనే సంస్కృతిని ప్రవేశపెట్టిన జాతీయ నేతలు వాళ్ల పిల్లలను ఏ దేశంలో చదివిస్తున్నారో వాళ్ళ పిల్లలకు వివాహ సంబంధాలను ఏ కులాల వారితో ఏ మతాల వారితో ఏ జాతుల వారితో ఏ దేశపు వారితో కుదుర్చుకుంటున్నారో బహిరంగంగా చెప్పగలరా అంటూ సూటిగా ప్రశ్నించారు. దగుల్బాజీ పనులను కూడా దర్జాగా చేసే కుసంస్కృతి కేవలం నీతి తప్పిన రాజకీయ నాయకులకు మాత్రమే సాధ్యమవుతుందంటూ హెచ్చరించారు. 24 గంటలలో 10 అబద్దాలకు జీవం పోస్తున్న రాజకీయ నేతలందరూ అబద్ధాలకు ఆదర్శ పురుషులుగా ప్రపంచ స్థాయి రికార్డులను బద్దలు కొడుతున్నారన్నారు.

**యువతను చెడగొడుతున్న పాలకులు.**

నేటి బాలలే రేపటి పౌరులు అనే సూక్తికి విరుద్ధంగా నేటి యువతను ఎంత నాశనం చేస్తే అంతటి స్థాయిలో రాజకీయపాలకుల చెప్పుచేతల్లో ఉంటారని భావిస్తున్న ప్రతి రాజకీయ నాయకుడు వాళ్ల వాళ్ల ప్రాంతాల్లో ఉన్న యువతను మత్తు పానీయాలకు డ్రగ్స్ కు గంజాయికి వ్యసనాలకు అలవాటు చేస్తూ విద్యకు దూరంగాను జీవిత లక్ష్యాలకు మరింత దూరంగాను కుటుంబాలకు రక్షణ లేకుండా జీవించే విధంగా చేస్తూ జీవితం మీద విరక్తి కలిగే విధంగా యువత జీవితాలను శాసిస్తూ రాజకీయ ప్రలోభాలకు రాజకీయ అలవాట్లకు రాజకీయ స్వార్థాలకు వాడుకోవడమే కాకుండా యువతను దేశంలో దేనికి అక్కరకు రాకుండా చేస్తున్నారని మండిపడ్డారు. ధర్మం నిజాయితీగా ఉండాలని మతం పదిమందికి మేలు చేయాలని భావిస్తున్న తరుణంలో ధర్మ అధర్మాలను పక్కన పెడుతూ మతం ముసుగులో జరుగుతున్న దోపిడిదారి దాడులన్నీ రాజకీయ పాలకులు చేయిస్తున్నవేనని హెచ్చరించారు. యువత జీవితాలను ఆగం చేస్తున్న రాజకీయ నాయకులు దేశ పాలనను అన్ని రాష్ట్రాల పరిపాలనను 30 సంవత్సరాల వెనక్కి నెట్టేస్తున్నారని వాటి వల్ల రాజకీయ పాలకులకు పెద్ద ఎత్తున ఉపయోగ జరిగించబడుతూ దేశ ప్రజలను అన్ని విధాలుగా వెనుకకు నెడుతూ నాశనంచేస్తున్నారని బాధ వ్యక్తం చేశారు. రాజకీయ పాలకుల ఆస్తుల వివరాలు వందల కోట్ల రూపంలో వేలకోట్ల రూపంలో లక్షల కోట్ల రూపంలో పెరిగిపోతూ ఉంటుండగా దేశ ప్రజల బ్రతుకు మాత్రం కంచంలో కూడుకు పరిమితమైపోయి బ్రతుకుతున్నారని బాధపడ్డారు. యువతను నాశనం చేస్తున్న పాలకులు అదేవిధంగా దేశాన్ని కూడా నాశనం చేస్తున్నారని హెచ్చరించారు. కనీసానికి దేశంలో దైవభక్తినైనా ప్రజా విశ్వాసానికి అనుకూలంగా కొనసాగించుకునే స్వేచ్ఛను చంపుతూ పురాణాలు శాస్త్రాలు గ్రంధాలు మతాలు అంటూ ప్రజల విశ్వాసాన్ని పీక్కుతినడమే కాకుండా ప్రజల జీవితాలను బుగ్గిపాలు చేస్తున్నారని అలాంటి భయంకరమైన దాడుల సంస్కరణలకు యువతను పావులుగా వాడుకుంటున్నారని హెచ్చరించారు. దేశంలో పెరిగిపోతున్న ఇలాంటి భయంకర మైన అనాధికార సంస్కరణల పట్ల దేశ ప్రజలు దేశ యువత మేధావులు కవులు కళాకారులు శాస్త్రవేత్తలు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం దేశంలోని యువత అంతర్మాదంలో పడ్డారని రాజకీయ నాయకుల కబంధహ స్తాల్లో నుండి బయటకు వచ్చి దేశాన్ని కాపాడుకోవడానికి మేధావుల రూపంలో దూసుకుపోతున్నారని అలాంటి యువ తపై దాడి చేయడానికి మతం ముసుగు యువతను ఉసిగొ లుపుతూ రాజకీయపాలకులు దాడులు చేయిస్తున్నారని హెచ్చరించారు.

## పోలీస్ ట్రాన్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్ ఎన్నికల్లో నందిపాటి నాగరాజు విజయం

**హైదరాబాద్(జై భీమ్ న్యూస్)**

పోలీస్ ట్రాన్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్ సంక్షేమ సంఘ ఎన్నికల్లో నందిపాటి నాగరాజు విజయం సాధించారు. ఎస్పీ ఏ. రాజేష్ కుమార్ ఆధ్వర్యంలో ఎన్నికలు పారదర్శకంగా, నిష్పాక్షికంగా, ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించినందుకు నాగరాజు కృతజ్ఞతలు తెలిపారు. తనపై విశ్వాసం ఉంచి వ్యక్తిగత ఓటింగ్ ద్వారా అమూల్యమైన ఓట్లతో గెలిపించిన పోలీస్ ట్రాన్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్ సిబ్బంది అందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. తన గెలుపు సిబ్బంది అందరి విజయంగా భావిస్తున్నానని నందిపాటి నాగరాజు పేర్కొన్నారు. తనపై ఉంచిన నమ్మకం ఒక గొప్ప బాధ్యతగా భావించి, సంస్థ సంక్షేమం, సిబ్బంది హక్కులు, సమాన అవకాశాలు, అభివృద్ధి కోసం నిబద్ధతతో పనిచేస్తానని తెలిపారు. సిబ్బంది ఐక్యతే బలమని, వారి ఆశయాల సాధన కోసం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని నాగరాజు పేర్కొన్నారు.

# దివ్యాంగులకు‘లా’ అందుబాటులోకి రావాలి..!

- ▶▶ దివ్యాంగులకు ప్రత్యేకమైన న్యాయస్థానాలను ఏర్పాటు చేయాలి.
- ▶▶ దివ్యాంగులకు ప్రతి జిల్లాలో నూతన పోలీస్ స్టేషన్ నియమించాలి.
- ▶▶ దివ్యాంగుల సంక్షేమమే సర్వ సమస్యలకు పరిష్కార మార్గం.
- ▶▶ న్యాయపరమైన సంస్కరణలతోనేదివ్యాంగులకు మేలు చేకూర్చబడుతుంది.
- ▶▶ దివ్యాంగుల మేధస్సు రాజకీయాలను సైతం శాసించగలదు.
- ▶▶ దివ్యాంగులకు కొత్త రకమైన చట్టాలను రూపొందించాలి.
- ▶▶ దివ్యాంగుల రిజర్వేషన్లను తూచా తప్పకుండా అమలుపరచాలి.
- ▶▶ దివ్యాంగులను వేధిస్తే కఠినమైన చట్టం రూపంలో చర్యలు చేపట్టాలి.
- ▶▶ ప్రజాస్వామ్యానికి రక్షణ ప్రతిరూపాలు దివ్యాంగులే.
- ▶▶ సమాజ రక్షణలో దివ్యాంగుల మేధస్సు మహాద్భుతం.
- ▶▶ దివ్యాంగులకు మెండుగా రాజకీయపరమైన అవకాశాలు కల్పించాలి.
- ▶▶ ప్రభుత్వ నామినేటెడ్ పదవులతో ఉన్నతంగా గౌరవించాలి.
- ▶▶ దివ్యాంగులకు “లా”ను పరిపూర్ణ స్థితిలో అందుబాటులోనికి తీసుకురావాలి.
- ▶▶ డాక్టర్ బరిగెల శివ.

**హైదరాబాద్ జై భీమ్ డెస్క్:-**



తెలంగాణ రాష్ట్రంలో దివ్యాంగుల హక్కులు రక్షించబడాలంటే దివ్యాంగుల పట్ల ప్రభుత్వాలు ప్రభుత్వ పాలకులు తమ ఉదార స్వభావాన్ని కనపరచాలని డాక్టర్ బరిగెల శివ కోరారు. రాజకీయ పాలకుల ఆలోచన విధానాలు దివ్యాంగుల సంక్షేమ రక్షణ పట్ల స్పష్టంగా ఉండాలని తెలిపారు. ప్రతి జిల్లాలో దివ్యాంగులకు న్యాయపరమైన చట్టపరమైన సమస్యలు తలెత్తుతున్నందున దివ్యాంగుల రక్షణార్థం జిల్లాకు ఒక పోలీస్ స్టేషన్ను జిల్లాకు ఒక న్యాయస్థానాన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేసి ప్రభుత్వాలు దివ్యాంగులకు న్యాయం చేయాలని కోరారు. కాకతీయ విశ్వవిద్యాలయంలో ప్రతిష్టాత్మకమైన మేధావి వర్గానికి చెందిన ప్రొఫెసర్ శ్రీనివాస రావు పెదమళ్ళ మూడు దశాబ్దాలుగా తన జీవితాన్ని దివ్యాంగుల రక్షణ కోసం దివ్యాంగుల హక్కుల కోసం దివ్యాంగుల పరిరక్షణ కోసం నిరంతరంగా కృషి చేస్తుండడాన్ని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని పేర్కొన్నారు. చట్టాల రూపంలో న్యాయస్థానాల రూపంలో దివ్యాంగులకు మేలు కలిగే విధంగా తన కుండబడిన పరిజ్ఞానవంతమైన మేధస్సును “కలం” రూపంలో సమాజానికి అందిస్తున్న ఆచార్య శ్రీనివాస రావును గౌరవించుకొని తీరాలని స్పష్టం చేశారు. ఉద్యమాలతో సాధించుకోలేని హక్కులను రచనల రూపంలో కలం రూపంలో సాధించుకోగలమని భావించిన ఆచార్య శ్రీనివాసరావు ఉద్యమ స్ఫూర్తికి ఆదర్శంగా నిలుస్తూనే దేశం గర్వించదగ్గ మేధావిగా ఎదుగుతుండడమే కాకుండా నీతికి నిజాయితీకి నిబద్ధతకు వ్యక్తిగత ఆత్మగౌరవానికి వ్యక్తిగత ఆత్మవిశ్వాసానికి ప్రత్యేకంగా నిలుస్తున్నారని తన జీవిత చరిత్ర తెరిచిన పుస్తకంతో సమానంగా సమాజానికి అంకితం చేయబడిందన్నారు. ఈ సందర్భంగా తన వ్యాసాన్ని గౌరవిస్తూ సమాజం పట్ల తనకున్న అంకిత భావాన్ని అభిమానించాలన్నారు.

**ఆచార్యుని(శ్రీనివాసరావు పెదమళ్ళ) వ్యాసం అద్భుతమైన ఆదర్శం.**

దివ్యాంగులకు చట్టాలు ఉన్నాయి, హక్కులు ఉన్నాయి. కానీ న్యాయం అందుబాటులో లేదనేది జగద్విదితం. భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమానత్వం, గౌరవం, స్వేచ్ఛతో జీవించే హక్కును కల్పించింది. దివ్యాంగుల హక్కుల పరిరక్షణ కోసం దివ్యాంగుల హక్కుల చట్టం–2016 వంటి సమగ్ర చట్టాలు కూడా ఉన్నాయి. అయినప్పటికీ, ఒక కీలకమైన ప్రశ్న మన ముందుంది. –చట్టం ఉన్నంత మాత్రాన దివ్యాంగులకు న్యాయం అందుతున్నదా. చట్టం పుస్తకాల్లో ఉండటం ఒక విషయం. ఆ చట్టం దివ్యాంగుడి జీవితంలో అమలవడం మరో విషయం. హక్కుల గురించి తెలియకపోవడం కూడా ఒక అడ్డంకే తమకు ఉన్న హక్కులు ఏమిటో చాలా మంది దివ్యాంగులకు పూర్తిగా తెలియదు. హక్కులు ఉల్లంఘించబడినప్పుడు ఎవరిని ఆశ్రయించాలి. పోలీసులకు ఎలా ఫిర్యాదు చేయాలి. ఉచిత న్యాయ సహాయం ఎక్కడ లభిస్తుంది. ప్రభుత్వ అధికారులను ఎలా సంప్రదించాలి అనే ప్రశ్నలకు సమాధానాలు తెలియకపోవడం వల్ల అనేక సమస్యలు పరిష్కారం కాకుండానే మిగిలిపోతున్నాయి. అందువల్ల దివ్యాంగులకు న్యాయ అవగాహనను ఒక ప్రత్యేక ప్రభుత్వ కార్యక్రమంగా చేపట్టాల్సిన అవసరం ఉంది. కోర్టు వరకు చేరుకోవడం కూడా సవాలేదివ్యాంగులకు న్యాయ ప్రాప్యత అంటే కేవలం కోర్టు భవనం అందుబాటులో ఉండటం కాదు. కోర్టుకు వెళ్లడం, పత్రాలు చదవడం, న్యాయవాదిని సంప్రదించడం, వాదనలు అర్థం చేసుకోవడం, సాక్ష్యాలను సమర్పించడం వంటి ప్రతి దశలో యాక్సెసిబిలిటీ ఉండాలి. వీల్‌చైర్ వినియోగించే వ్యక్తికి భౌతిక ప్రాప్యత, దృష్టి లోపం ఉన్న వ్యక్తికి బ్రెయిలీ లేదా ఆడియో సమాచారం, వినికిడి లోపం ఉన్న వ్యక్తికి సంకేత భాషా సహాయం, ఇతర దివ్యాంగులకు అవసరమైన సహాయక సాంకేతికత అందాలి. న్యాయం పొందే ప్రక్రియే ఒక అడ్డంకిగా మారితే, అది నిజమైన న్యాయప్రాప్యత కాదు.

పోలీస్ వ్యవస్థ మరింత సున్నితంగా మారాలి. దివ్యాంగుడు పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించినప్పుడు అతని ఫిర్యాదును సాధారణ పద్ధతిలో మాత్రమే కాకుండా, అతని వైకల్యానికి అనుగుణంగా స్వీకరించే విధానం ఉండాలి. పోలీసు అధికారులు, న్యాయాధికారులు, ప్రభుత్వ సిబ్బందికి దివ్యాంగుల హక్కులు, కమ్యూనికేషన్ పద్ధతులు, చట్టపరమైన రక్షణలపై ప్రత్యేక శిక్షణ ఇవ్వాలి. ఉచిత న్యాయ సహాయం ప్రతి దివ్యాంగుడి గడపకు చేరాలి. ఆర్థిక ఇబ్బందుల కారణంగా దివ్యాంగుడు న్యాయం కోసం పోరాడకుండా వెనక్కి తగ్గకూడదు. ఉచిత న్యాయ సహాయం గురించి సమాచారం గ్రామస్థాయిలోనే అందాలి. ప్రతి జిల్లాలో దివ్యాంగుల కోసం ప్రత్యేక న్యాయ సహాయ కేంద్రాలు ఏర్పాటు చేసి, న్యాయ సలహా, ఫిర్యాదుల నమోదు, సంబంధిత అధికారులతో సమన్వయం, అవసరమైన న్యాయ సహాయం వంటి సేవలను అందించాలి. డిజిటల్ న్యాయ వ్యవస్థ కూడా అందుబాటులో ఉండాలి. ప్రభుత్వ సేవలు వేగంగా డిజిటల్ అవుతున్నాయి. కానీ డిజిటల్ సేవలు అందరికీ సమానంగా అందుబాటులో ఉన్నాయా అనేది పరిశీలించాలి. ప్రభుత్వ వెబ్‌సైట్లు, ఆన్‌లైన్ ఫిర్యాదు వ్యవస్థలు, మొబైల్ అప్లికేషన్లు యాక్సెసిబిలిటీ స్టాండర్డ్స్‌కు అనుగుణంగా ఉండాలి. స్క్రీన్ రీడర్ వినియోగదారులు సులభంగా ఉపయోగించగలగాలి. వీడియోలకు క్యాప్షన్లు, అవసరమైన చోట సంకేత భాష అందుబాటులో ఉండాలి. చట్టాల అమలుపై సామాజిక పర్యవేక్షణ అవసరం. దివ్యాంగుల హక్కుల చట్టం అమలును కేవలం ప్రభుత్వ శాఖలకే పరిమితం చేయకుండా, దివ్యాంగుల సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, విద్యాసంస్థలు, న్యాయ నిపుణుల భాగస్వామ్యంతో పర్యవేక్షించాలి. యాక్సెసిబిలిటీ ఆడిట్, సోషల్ ఆడిట్, లీగల్ అవేర్నెస్ క్యాంపైన్స్‌ను క్రమం తప్పకుండా నిర్వహించాలి. చట్టం ఉల్లంఘనకు గురైన వ్యక్తికి త్వరితగతిన పరిష్కారం లభించే వ్యవస్థను బలోపేతం చేయాలి. మారాల్సింది దృష్టికోణందివ్యాంగులను కేవలం సంక్షేమ పథకాల లబ్ధిదారులుగా చూడటం సరిపోదు. వారు హక్కులు కలిగిన పౌరులు. వారికి దానం అవసరం లేదు; అవకాశం, గౌరవం, సమానత్వం, న్యాయం అవసరం. అందుకే ప్రభుత్వాలు “దివ్యాంగుల కోసం చట్టాలు” రూపొందించడమే కాకుండా, “దివ్యాంగులు ఆ చట్టాలను సులభంగా ఉపయోగించుకునే పరిస్థితులు” కల్పించాలి.

దివ్యాంగుడికి న్యాయం అందుబాటులోకి వచ్చిన రోజే సామాజిక న్యాయం, రాజ్యాంగ న్యాయం మరింత అర్థవంతమవుతుంది. చట్టం అందరికీ ఒకటే కావచ్చు. కానీ ఆ చటాన్ని చేరుకోవడానికి అవసరమైన సహాయం అందరికీ సమానంగా ఉండాలి. దివ్యాంగుల కోసం చట్టాలు ఉండటం ప్రజాస్వామ్యానికి గొప్ప విషయం. కానీ ఆ చట్టాలు వారి జీవితాల్లో అమలయ్యేలా చేయడం ప్రభుత్వం, న్యాయవ్యవస్థ, సమాజం–మూడు వర్గాల సమిష్టి బాధ్యత.



వ్యాస రచయిత ప్రొఫెసర్ శ్రీనివాస రావు పెదమళ్ళ.
విభాగాధిపతి, ప్రజా పాలనా శాస్త్రం,
మానవ వనరుల నిర్వహణ శాస్త్ర,
కాకతీయ యూనివర్సిటీ, వరంగల్.
9572134456.

# బల్దియాలో బదిలీలకు బ్రేక్ ఎవరి కోసం?

- ▶▶ ఆర్ఐల దీర్ఘకాలిక పోస్టింగ్‌లపై కొత్త చర్చ
- ▶▶ ఒకే చోట ఏళ్ల తరబడి కొనసాగుతున్న వారికి ఎవరి అండ?
- ▶▶ ఫైళ్ల జాప్యంపై ఫిర్యాదులు.. చర్యలపై మాత్రం నిశ్శబ్దం!

**వరంగల్, 16 సెప్టెంబర్, జై భీమ్ న్యూస్ :**

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ల (ఆర్ఐ) దీర్ఘకాలిక పోస్టింగ్‌ల వ్యవహారం మరోసారి చర్చనీయాంశంగా మారింది. కొంతమంది ఆర్ఐలు నాలుగు నుంచి ఆరు సంవత్సరాలుగా ఒకే ప్రాంతం లేదా ఒకే విభాగంలో కొనసాగుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రజలతో నేరుగా సంబంధం ఉన్న రెవెన్యూ విభాగంలో సిబ్బంది దీర్ఘకాలికంగా ఒకే చోట పనిచేస్తుండటంపై పలువురు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. బదిలీ నిబంధనలు అందరికీ ఒకే విధంగా అమలవుతున్నాయా? దీర్ఘకాలిక పోస్టింగ్‌లకు అధికారిక కారణాలేమిటి? అనే చర్చ సాగుతోంది.

**ఫైళ్లు ఎందుకు పెండింగ్‌లో ఉంటున్నాయి?**

ఇంటి పన్నులు, ఆస్తి వివరాల మార్పులు, ఇంటి నంబర్లు, నల్లా కనెక్షన్లు తదితర మున్సిపల్ సేవలకు సంబంధించిన దరఖాస్తుల విషయంలో జాప్యం జరుగుతోందని కొందరు ప్రజలు ఆరోపిస్తున్నారు. కొన్ని ఫైళ్లు నిర్ణీత సమయంలో పరిష్కారం కాకుండా పెండింగ్‌లో ఉంటున్నాయన్న ఫిర్యాదులు కూడా వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణల్లో వాస్తవం ఎంత అన్నది అధికారిక విచారణతోనే తేలాల్సి ఉంది.

**‘చేతివాటం’ ఆరోపణలపై విచారణ ఎప్పుడు?**

బల్దియా కార్యాలయంలో కొన్ని పనులు త్వరగా జరగాలంటే అనధికారిక చెల్లింపులు చేయాల్సి వస్తోందన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. అయితే సంబంధిత ఉద్యోగులపై ఇలాంటి ఆరోపణలు నిర్ధారణ కాలేదు. ప్రజల నుంచి ఫిర్యాదులు అందితే వాటిపై విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. ఆరోపణలు నిరాధారమైతే అధికారికంగా స్పష్టత ఇవ్వడం, నిజమని తేలితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవడం అవసరం.

**కీలక పోస్టింగ్‌ల వెనుక కారణాలేమిటి?**

కొన్ని కీలక ప్రాంతాల్లో పనిచేసేందుకు కొంతమంది ఉద్యోగులు ఆసక్తి చూపుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. తమకు అనుకూలమైన ప్రాంతాల్లోనే కొనసాగేందుకు పలుకుబడి ఉపయోగిస్తున్నారనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి ఆధారాలు, అధికారిక రికార్డులు వెలుగులోకి రావాల్సి ఉంది. ఉద్యోగుల పోస్టింగ్ చరిత్ర, బదిలీ ఉత్తర్వులు, దీర్ఘకాలిక కొనసాగింపుకు ఉన్న పరిపాలనా కారణాలను పరిశీలిస్తే అసలు పరిస్థితి స్పష్టమయ్యే అవకాశం ఉంది.

**వరుస కథనాలు.. చర్యలు ఎక్కడ?**

ఆర్ఐల దీర్ఘకాలిక పోస్టింగ్‌లు, ఫైళ్ల పెండింగ్, ప్రజలకు ఎదురవుతున్న ఇబ్బందులపై వరుసగా ఆరోపణలు వెలువడుతున్నప్పటికీ ఇప్పటివరకు స్పష్టమైన అధికారిక వివరణ లేకపోవడం చర్చకు దారితీస్తోంది. ఆరోపణలు నిజం కాకపోతే ఖండించాలి.. నిజమైతే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి. ఈ రెండింటిలో ఏదో ఒకటి స్పష్టంగా కనిపించాల్సిన అవసరం ఉందని ప్రజలు అంటున్నారు.

**అధికారుల స్పందనకు ప్రత్యేక స్థానం**

ఈ ఆరోపణలపై గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నతాధికారుల అధికారిక స్పందన ఏమిటన్నది కీలకంగా మారింది. ఒకే ప్రాంతంలో ఏళ్ల తరబడి పనిచేస్తున్న ఆర్ఐల వివరాలు, వారి బదిలీ నిబంధనలు, దీర్ఘకాలిక పోస్టింగ్‌లకు ఉన్న కారణాలు, పెండింగ్ ఫైళ్ల సంఖ్య, ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులు, అవినీతి ఆరోపణలపై జరిగిన విచారణల వివరాలపై అధికారులు స్పష్టత ఇవ్వాల్సి ఉంది. అలాగే “ఒకే చోట దీర్ఘకాలంగా పనిచేస్తున్న ఉద్యోగులపై శాఖాపరంగా సమీక్ష నిర్వహించారా? బదిలీల విషయంలో ఏమైనా మార్గదర్శకాలు అమలులో ఉన్నాయా? ఫైళ్ల జాప్యంపై తనిఖీలు చేపట్టారా? ‘చేతివాటం’ ఆరోపణలపై ఫిర్యాదులు అందాయా?” వంటి ప్రశ్నలకు అధికారుల సమాధానం ప్రజలకు ఆసక్తికరంగా మారింది. అధికారుల స్పందన అందిన వెంటనే అదే ప్రాధాన్యతతో ప్రచురించబడుతుంది. సంబంధిత ఉద్యోగులు లేదా అధికారులు తమ వాదనను వెల్లడించేందుకు అవకాశం ఇవ్వడం ద్వారా వార్తను పూర్తి వాస్తవాలతో ప్రజల ముందుంచడం అవసరం.




**రికార్డులు బయటపెడితే అసలు విషయం తేలిపోతుందా?**

బల్దియా అధికారులు పోస్టింగ్‌లు, బదిలీలు, పెండింగ్ ఫైళ్లు, ఫిర్యాదులు, విచారణలకు సంబంధించిన వివరాలను పారదర్శకంగా వెల్లడిస్తే ఆరోపణలు, వాస్తవాల మధ్య తేడా స్పష్టమయ్యే అవకాశం ఉంది. ప్రజలకు సేవ చేయాల్సిన మున్సిపల్ వ్యవస్థలో వ్యక్తుల కంటే నిబంధనలు, పారదర్శకత, జవాబుదారీతనానికి ప్రాధాన్యం ఉండాలి.

**ప్రజల ప్రశ్న ఒక్కటే..**

1),‘నిబంధనలు అందరికీ సమానమేనా..?
2), దీర్ఘకాలిక పోస్టింగ్‌లపై అధికారుల సమీక్ష ఎప్పుడు?
3),ఫైళ్లు ఎందుకు పెండింగ్‌లో ఉన్నాయి? ఆరోపణలపై అధికారిక విచారణ ఎప్పుడు?”

ఈ ప్రశ్నలకు బల్దియా ఉన్నతాధికారులు ఏం సమాధానం ఇస్తారో వేచి చూడాల్సిందే.

# అంబేద్కర్‌ను దూషించిన హమర..
# ప్రసాద్‌ను అరెస్ట్ చేయాలి




**- 'కలుపుతా నాయకుడు' పుస్తకాన్ని వెంటనే నిలిపివేయాలని డిమాండ్**

**హన్మకొండ, 16 సెప్టెంబర్, జై భీమ్ న్యూస్:**
భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌ను దూషించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న హమర ప్రసాద్‌పై సమగ్ర విచారణ జరిపి, ఆరోపణలు నిజమని తేలితే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ హనుమకొండ అంబేద్కర్ సెంటర్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. అలాగే కలుపుతా నాయకుడు పుస్తకంలోని అభ్యంతరకర అంశాలను అధికారులు పరిశీలించి, అవసరమైన చర్యలు తీసుకోవాలని నిరసనకారులు కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ భారత రాజ్యాంగ నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన మహనీయుడని, సమాజంలోని అణగారిన వర్గాల హక్కుల కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. అంబేద్కర్‌ను అవమానించేలా వ్యాఖ్యలు చేసినట్లు హమర ప్రసాద్‌పై వచ్చిన ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి, వాస్తవాలను నిర్ధారించి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కలుపుతా నాయకుడు పుస్తకంలో అంబేద్కర్‌ను అవమానించే అంశాలు ఉన్నాయన్న ఆరోపణలను సంబంధిత అధికారులు పరిశీలించాలని, విచారణ పూర్తయ్యే వరకు పుస్తక ప్రచురణ, పంపిణీ, విక్రయాల విషయంలో తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అంబేద్కర్ గౌరవానికి భంగం కలిగించే వ్యాఖ్యలు, రచనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం, సంబంధిత అధికారులు చట్టపరంగా స్పందించాలని విజ్ఞప్తి చేశారు. పిలుపునిచ్చిన వెంటనే స్పందించి నిరసన కార్యక్రమానికి హాజరైన మాల బంధువులు, రిటైర్డ్ ఉద్యోగులు, యువకులు, వివిధ సామాజిక వర్గాల ప్రతినిధులకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ డీఎస్పీ దామర నర్సయ్య, జోరుక రమేష్, కొండ్రా నర్సింగరావు, రైతు రమేష్, ఎల్ఐసీ రామకృష్ణ, దారా నరసయ్య, కటారి కుమార్, పోతుల కొమ్మాల్, సాధు కుమార్, సింగారపు రవి ప్రసాద్, చదవాల సారంగ పాణి, నూనె రాములు, పాలు అడుగుల నర్సయ్య, దండే శ్రీనివాస్, దండే సదా నందం, పొనగంటి లక్ష్మీనారాయణ, సదివాల అరుణ్, బూజుగుళ్ల అనిల్, దండు రాజు, రవికుమార్, రౌతు రాజేందర్, రమేష్ యా డాల, జగపతి, పనికిల శ్రీనివాస్, మంద మ ల్లేష్, సంపత్ రమేష్, సాధు ధనుంజయ్, నక్క కిషన్, బండి చంద్రశేఖర్, కరుకు వెం కట స్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాల్గొన్న వారందరికీ పేరుపేరు నా అభివాదాలు తెలియజేస్తూ నిర్వాహకులు జై భీమ్.. జై అంబేద్కర్.. జై మాల అంటూ నినాదాలు చేశారు. అంబేద్కర్ ఆశయాలు, రాజ్యాంగ విలువలను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు.





## విద్యార్థి ఉద్యమకారుల అరెస్టులను ఖండించిన బిఆర్ఎస్వి

**- ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి: జట్టి రాజేందర్**

**హన్మకొండ, సెప్టెంబర్ 16 (జై భీమ్ న్యూస్)**
విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి పిలుపునిచ్చిన నేపథ్యంలో బి.ఆర్.ఎస్.వి నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేయడాన్ని కేయూ బిఆర్ఎస్వి ఇన్‌చార్జి జట్టి రాజేందర్ తీవ్రంగా ఖండించారు. బుధవారం హాసన్‌పర్తి పోలీసులు తనను ముందస్తుగా అరెస్టు చేశారని ఆయన తెలిపారు. రాష్ట్రంలో విద్యార్థులకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు రెండు, మూడు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్నాయని జట్టి రాజేందర్ పేర్కొన్నారు. దాదాపు రూ.8 వేల కోట్ల మేర బకాయిలు ఉన్నాయని, ముఖ్యంగా పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల కాకపోవడంతో డిగ్రీ, పీజీ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులు ఉన్నత చదువులకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కొన్ని కళాశాలల యాజమాన్యాలు ఫీజులు చెల్లించాలని విద్యార్థులపై ఒత్తిడి చేస్తూ ఒరిజినల్ సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నాయని ఆరోపించారు. పేదరికం కారణంగా ఫీజులు చెల్లించలేని విద్యార్థుల సర్టిఫికెట్లు కళాశాలల్లోనే నిలిచిపోతే వారి ఉన్నత విద్య మధ్యలోనే ఆగిపోయే ప్రమాదం ఉందని జట్టి రాజేందర్ ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలపై ప్రజాస్వామ్యబద్ధంగా ఉద్యమిస్తున్న నాయకులను ముందస్తు అరెస్టులు చేయడం సరికాదని ఆయన అన్నారు. ప్రభుత్వం వెంటనే విద్యార్థుల సమస్యలను పరిష్కరించకపోతే రాష్ట్ర బిఆర్ఎస్వి ఆధ్వర్యంలో మరింత పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని జట్టి రాజేందర్ హెచ్చరించారు.





## అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

**- పుస్తక ఆవిష్కరణను నిలిపివేసి, లా అండ్ ఆర్డర్ సమస్యలు తలెత్తకుండా చూడాలని వినతి**

**వరంగల్, 16 సెప్టెంబర్, (జై భీమ్ న్యూస్)**
భారత రాజ్యాంగ నిర్మాత, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ ఆయనను కించపరిచే విధంగా ప్రచారం చేస్తున్నారని ఆరోపణలు ఎదుర్కొంటున్న హమారా ప్రసాద్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ దళిత, బహుజన సంఘాల నాయకులు వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు గౌరవ డాక్టర్ కడియం కావ్య, జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే కడియం శ్రీహరికి వినతిపత్రం అందజేశారు. అంబేద్కర్‌ను కల్పిత నాయకుడిగా పేర్కొంటూ పుస్తకాన్ని ఆవిష్కరించేందుకు సిద్ధమవుతున్నారని ఆరోపిస్తూ, సంబంధిత కార్యక్రమాన్ని నిలిపివేయాలని నాయకులు కోరారు. ఈ విషయాన్ని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి, రాష్ట్ర డీజీపీ దృష్టికి తీసుకెళ్లి, అవసరమైన చట్టపరమైన చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరిని కోరినట్లు తెలిపారు. ఈ అంశం కారణంగా ఎలాంటి లా అండ్ ఆర్డర్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా డీబీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చుంచు రాజేందర్ మాట్లాడుతూ, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌ను ఎవరైనా అసభ్యకరంగా మాట్లాడినా, అనుచిత వ్యాఖ్యలు చేసినా, ఆయన విగ్రహాలను ధ్వంసం చేసినా కఠిన చర్యలు తీసుకునే విధంగా ప్రత్యేకంగా "అంబేద్కర్ రక్షణ చట్టం" తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ అంశంపై పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టి చర్చించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీ కడియం కావ్యకు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. అంబేద్కర్ దేశ రాజ్యాంగ నిర్మాణంలో కీలక పాత్ర పోషించారని, ఆయనపై అవమానకర వ్యాఖ్యలు సామాజికంగా ఉద్రిక్తతలకు దారితీయకుండా సంబంధిత అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ డిపార్ట్మెంట్ రాష్ట్ర నాయకులు డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ, ప్రజా సంఘాల జేఏసీ జిల్లా చైర్మన్ మాదాసి సురేష్, దళిత బహుజన సంఘాల నాయకులు సిద్ధిరాజ్ యాదవ్, కేడల ప్రసాద్, అంకూస్ రవి కుమార్, మైదం జయపాల్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

## కేయూలో తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం

**కేయూ క్యాంపస్, 16 సెప్టెంబర్, జై భీమ్ న్యూస్ :**




తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం--2026ను పురస్కరించుకుని సెప్టెంబర్ 17న కాకతీయ విశ్వవిద్యాలయం లో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు విశ్వవిద్యా లయ రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 8 గంటలకు కాకతీయ విశ్వవిద్యాలయ పరిపాలనా భవనం ఎదుట కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విశ్వ విద్యాలయ వైస్‌చాన్స్‌లర్ ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారని తెలిపారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయంలోని అన్ని విభాగాల బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధక విద్యార్థులు, విద్యార్థులు పెద్ద సంఖ్య లో పాల్గొనాలని రిజిస్ట్రార్ కోరారు.

## దుగ్గొండి పీహెచ్‌సీలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

**-వైద్య సేవల నాణ్యత పెంచాలి..**
**-పరిశుభ్రత, మందుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి**

**వరంగల్, 16 సెప్టెంబర్, జై భీమ్ న్యూస్ :**
వరంగల్ జిల్లా దుగ్గొండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సత్య శారదాదేవి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలోని రికార్డులు, ల్యాబొరేటరీ, ఫార్మసీ, వార్డు, ఆసుపత్రి పరిసరాలను పరిశీలించి వైద్య సేవల నిర్వహణపై అధికారులను, సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి చికిత్స కోసం వచ్చిన రోగులతో కలెక్టర్ నేరుగా మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలు, మందుల లభ్యత, సిబ్బంది పనితీరు తదితర అంశాలపై ఆరా తీశారు. ప్రజలకు అందించే వైద్య సేవల్లో ఎలాంటి లోపాలు లేకుండా నిర్దేశించిన ప్రమాణాలను పాటించాలని సూచించారు. పీహెచ్‌సీ పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. ఆసుపత్రి లోపల, బయట ప్రాంగణాన్ని నిరంతరం శుభ్రంగా నిర్వహించాలని స్పష్టం చేశారు. అన్ని సేవా సూచికల్లో నిర్దేశించిన లక్ష్యాలను సాధించేలా పనితీరును మెరుగుపరచాలని సూచించారు. ఫార్మసీ నిర్వహణపై ప్రత్యేకంగా దృష్టి సారించిన కలెక్టర్, పీహెచ్‌సీలోని అన్ని ఔషధాలకు స్పష్టమైన లేబులింగ్ ఉండాలని, మందులను సులభంగా గుర్తించే విధంగా క్రమపద్ధతిలో అమర్చాలని ఆదేశించారు. ఈ-ఔషధి పోర్టల్ ద్వారా మందుల నిల్వలు, పంపిణీని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. టీకాల కార్యక్రమంలో వ్యాక్సినేషన్ సేవలను బ్యాచ్ వారీగా నిర్వహించి, సంబంధిత బ్యాచ్ నంబర్లను పక్కాగా నమోదు చేయాలని తెలిపారు. అలాగే బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణలో నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, మెడికల్ వ్యర్థాల కోసం కలర్ కోడెడ్ బిన్స్ వినియోగించాలని సూచించారు. బిన్స్ అందుబాటులో లేని సందర్భంలో రెడ్, బ్లాక్ కలర్ కవర్లను వినియోగించాలని ఆదేశించారు. ల్యాబొరేటరీలో సేకరించిన శాంపిల్స్, నిర్వహించిన పరీక్షలకు సంబంధించిన ప్రక్రియను క్రమబద్ధంగా నిర్వహిస్తూ, అవసరమైన ల్యాబ్ శాంపిల్స్‌ను క్రమం తప్పకుండా టి-హబ్‌కు పంపించాలని సూచించారు. పీహెచ్‌సీలో 24/7 అందుబాటులో ఉండే సిబ్బంది వివరాలతో పాటు నైట్ డ్యూటీ సిబ్బంది రోస్టర్ చార్ట్‌ను ఆసుపత్రి బయట ప్రజలకు స్పష్టంగా కనిపించే విధంగా ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సేవలు, నిర్వహణ ప్రమాణాలను మరింత మెరుగుపరిచి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సత్య శారదాదేవి స్పష్టం చేశారు. ఈ ఆకస్మిక తనిఖీలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. బి. రాజా రెడ్డి పాల్గొన్నారు.



## కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో డీసీహెచ్ఎస్ ఆకస్మిక తనిఖీ





**- రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి**
**- సిబ్బంది విధుల్లో క్రమశిక్షణ పాటించాలి**

**కమలాపూర్, 16 సెప్టెంబర్ 2026 (జై భీమ్ న్యూస్)**
కమలాపూర్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను డీసీహెచ్ఎస్ డాక్టర్ వంశీకృష్ణ బుధవారం మధ్యాహ్నం ఆకస్మికంగా సందర్శించి ఆసుపత్రిలోని వైద్య సేవలు, సౌకర్యాలు, సిబ్బంది పనితీరును పరిశీలించారు. మధ్యాహ్నం 12:45 గంటలకు ఆసుపత్రికి చేరుకున్న ఆయన, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ చందు నాయక్‌తో కలిసి ఆసుపత్రిలోని అన్ని విభాగాలను, ఆపరేషన్ థియేటర్ (ఓటీ)తో పాటు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఇన్‌పేషెంట్లతో పాటు ఓపీకి వచ్చిన రోగులతో డీసీహెచ్ఎస్ డాక్టర్ వంశీకృష్ణ నేరుగా మాట్లాడారు. వారికి అందుతున్న వైద్య సేవలు, వైద్యులు మరియు సిబ్బంది స్పందన, ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న సౌకర్యాలపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయనే విషయాన్ని తెలుసుకుని, అవసరమైన సేవలను మెరుగుపరచాలని సూచించారు. అనంతరం మధ్యాహ్నం 1:30 గంటల నుంచి 3 గంటల వరకు ఆసుపత్రిలోని వైద్యులు, నర్సింగ్ అధికారులు, పారా మెడికల్ సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా విభాగాల్లో ఉన్న సమస్యలు, సిబ్బంది ఎదుర్కొంటున్న ఇబ్బందులు, విధుల నిర్వహణకు సంబంధించిన అంశాలను అడిగి తెలుసుకున్నారు. విధుల నిర్వహణలో ప్రతి ఒక్కరూ క్రమశిక్షణ పాటించాలని డీసీహెచ్ఎస్ సూచించారు. ఆసుపత్రికి వచ్చే రోగులతో మర్యాదగా, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, విధుల్లో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకుండా తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని ఆదేశించారు. రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు వైద్యులు, నర్సింగ్ అధికారులు, పారా మెడికల్ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కొంతమంది సిబ్బంది తమ ప్రవర్తనలో మార్పు తీసుకురావాల్సిన అవసరం ఉందని డీసీహెచ్ఎస్ స్పష్టం చేశారు. క్రమం తప్పకుండా విధులకు హాజరై, అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి సకాలంలో అవసరమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. "మరికొద్ది రోజుల్లో మరోసారి ఆసుపత్రిని సందర్శిస్తాను. అప్పటికి మంచి ఫలితాలు, మెరుగైన సేవలు కనిపించాలని ఆశిస్తున్నాను" అని డీసీహెచ్ఎస్ డాక్టర్ వంశీకృష్ణ సిబ్బందికి తెలిపారు. డీసీహెచ్ఎస్ ఆకస్మిక తనిఖీతో ఆసుపత్రి సిబ్బందిలో మరింత బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలనే అవగాహన ఏర్పడింది. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ఆసుపత్రి సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని అధికారులు సూచించారు.

## ఉద్యమ నాయకుడు బాలకృష్ణ అరెస్ట్

**పర్వతగిరి, 16 సెప్టెంబర్, (జై భీమ్ న్యూస్)**
కాకతీయ విశ్వవిద్యాలయ ఉద్యమ నాయకుడు, బీఆర్ఎస్ యువజన నాయకుడు యార బాలకృష్ణను బుధవారం ఉదయం 5 గంటల సమయంలో పోలీసులు హౌస్ అరెస్ట్ చేసి, అనంతరం పర్వతగిరి పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఆయన అనుచరులు తెలిపారు. ప్రజా సమస్యలు, ప్రభుత్వం ఇచ్చిన హామీలపై ప్రశ్నిస్తున్న ఉద్యమ నాయకులను అరెస్టులు, నిర్బంధాలతో అణచివేయడం సరికాదని వారు పేర్కొన్నారు. ప్రశ్నించే గొంతులను నిర్బంధించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. అరెస్టులు, నిర్బంధాలతో ఉద్యమ స్ఫూర్తిని అడ్డుకోలేరని, ప్రజా సమస్యలపై ప్రశ్నించే ప్రతి గొంతుకకు ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఉందని వారు పేర్కొన్నారు.




## 70వ ఎస్‌జీఎఫ్ క్రీడా ఎంపికలు




**- కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్ విభాగాల్లో అండర్-14, అండర్-17 క్రీడాకారుల ఎంపిక**

**హాసన్‌పర్తి, సెప్టెంబర్ 16, జై భీమ్ న్యూస్,**
హనుమకొండ జిల్లా హాసన్‌పర్తి మండలంలో 70వ ఎస్‌జీఎఫ్ (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) మండల స్థాయి క్రీడా ఎంపికలు బుధవారం ప్రారంభమయ్యాయి. మండల స్థాయిలో కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్ క్రీడాంశాల్లో అండర్-14, అండర్-17 విభాగాలకు సంబంధించిన క్రీడాకారుల ఎంపికలను నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా ఎంపికల్లో పాల్గొని తమ క్రీడా ప్రతిభను ప్రదర్శించారు. క్రీడాకారుల నైపుణ్యం, ప్రతిభ ఆధారంగా తదుపరి స్థాయి పోటీలకు ఎంపిక చేసే ప్రక్రియ కొనసాగింది. కార్యక్రమానికి ఎస్‌జీఎఫ్ ప్రెసిడెంట్, ఎంఈఓ శ్రీనివాసరెడ్డి, జీహెచ్ఎం ఎం. విజయలక్ష్మి, జెడ్‌పీహెచ్ఎస్ బాయ్స్ హాసన్‌పర్తి హెచ్ఎం ఎన్. శ్రీధర్, జీహెచ్ఎం ఈ. సుమాదేవి, జీహెచ్ఎం పీఎం డి. శోభారాణి, జీహెచ్ఎం వి. పెగడపల్లి, వి. వాసుదేవరావు తదితరులు హాజరయ్యారు. అలాగే ఎస్‌జీఎఫ్ యూ-14, యూ-17 సెక్రటరీ ఎన్. శ్రీధర్, యూ-19 సెక్రటరీ ఎ. ప్రభాకర్‌రెడ్డి, ప్రెసిడెంట్ పీఈటీఏ టీఎస్ ఎస్. పార్వతిరెడ్డి, కె. మల్లారెడ్డి, హనుమకొండ 66వ డివిజన్ మాజీ కార్పొరేటర్ తేజ పాల్గొని క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల్లో శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, పట్టుదల, జట్టుగా పనిచేసే నైపుణ్యాలను పెంపొందిస్తాయని తెలిపారు. మండల స్థాయి ఎంపికల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు ఉన్నత స్థాయి పోటీల్లో పాల్గొని హాసన్‌పర్తి మండలానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

జై భీమ్
తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE
సమస్యలపై సమరంగా
Jai Bheem TV STRUGGLE FOR JUSTICE
సామాన్యుడి ఆయుధంగా
గురువారం 17- 09- 2026
www.jaibheemtv.com


# సెప్టెంబర్ 17న తెలంగాణ
# ప్రజా పాలన దినోత్సవం

- రాష్ట్రంలోని 32 జిల్లాల్లో జాతీయ పతాకావిష్కరణకు ప్రముఖుల నియామకం
- హనుమకొండలో పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి.. వరంగల్‌లో గద్వాల్ విజయలక్ష్మి.. ములుగులో సీతక్క

**హైద్రాబాద్, సెప్టెంబర్ 16 (జై భీమ్ న్యూస్)**

తెలంగాణ ప్రజా పాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని సెప్టెంబర్ 17న రాష్ట్ర వ్యాప్తంగా జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. హైదరాబాద్ మినహా రాష్ట్రంలోని 32 జిల్లాల్లో ఉదయం 10 గంటలకు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, గౌరవ వందనం స్వీకరించే బాధ్యతలను మంత్రులు, ప్రభుత్వ సలహాదారులు, శాసనసభ, శాసనమండలి ప్రతినిధులు, ఇతర ప్రముఖులకు ప్రభుత్వం అప్పగించింది. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం ఆదిలాబాద్ జిల్లాలో ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ సలహాదారు మహ్మద్ అలీ షబ్బీర్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో వ్యవసాయం, మార్కెటింగ్, సహకార, చేనేత-జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, హనుమకొండ జిల్లాలో రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార-పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జగిత్యాల జిల్లాలో మైనారిటీ సంక్షేమం, ప్రభుత్వ సంస్థల శాఖల మంత్రి మహమ్మద్ అజారుద్దీన్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో తెలంగాణ వెనుకబడిన తరగతుల కమిషన్ చైర్మన్ జి. నిరంజన్,

జనగామ జిల్లాలో తెలంగాణ శాసనసభ ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, జోగులాంబ గద్వాల జిల్లాలో ప్రత్యేక ప్రతినిధి, ప్రభుత్వ క్రీడల సలహాదారు ఏపీ జితేందర్‌రెడ్డి, కామారెడ్డి జిల్లా లో బీసీ సంక్షేమం, అభివృద్ధి ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. కరీంనగర్ జిల్లా లో ఎస్సీ అభివృద్ధి, గిరిజన సంక్షేమం, దివ్యాంగులు, వృద్ధులు, ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల సాధికారత శాఖల మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఖమ్మం జిల్లాలో ఉప ముఖ్య మంత్రి, ఆర్థిక-ప్రణాళిక, ఇంధన శాఖల మంత్రి భట్టి విక్రమార్క మల్లు, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో తెలంగాణ శాసన మండలి ఉపాధ్యక్షుడు బండా ప్రకాష్, మహబూబాబాద్ జిల్లాలో తెలంగాణ శాసనసభ ప్రభుత్వ విప్ జె. రాంచందర్ నాయక్, మహబూబ్‌నగర్ జిల్లాలో నిషేధిత మద్యపాన-ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు, మంచిర్యాల జిల్లాలో ప్రోటోకాల్, పౌర సంబంధాల ప్రభుత్వ సలహాదారు హరకర వేణుగోపాల్‌రావు, మెదక్ జిల్లాలో కార్మిక, ఉపాధి, శిక్షణ, కర్మాగారాలు, గనులు-భూగర్భ శాస్త్ర శాఖల మంత్రి వివేక్ వెంకటస్వామి, మేడ్చల్ జిల్లాలో ప్రభుత్వ ప్రజా వ్యవహారాల సలహాదారు కె. కేశవరావు పతాకావిష్కరణ చేయనున్నారు. ములుగు జిల్లాలో పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా-శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క, నాగర్‌కర్నూల్ జిల్లాలో తెలంగాణ ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, నల్గొండ జిల్లాలో రోడ్లు-భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, నారాయణపేట జిల్లాలో పశుసంవర్ధక, పాడి పరిశ్రమ అభివృద్ధి, మత్స్య, క్రీడలు-యువజన సేవల శాఖల మంత్రి వాకిటి శ్రీహరి, నిర్మల్ జిల్లాలో తెలంగాణ శాసనసభ ప్రభుత్వ విప్ వేముల వీరేశం, నిజామాబాద్ జిల్లాలో ఎమ్మెల్యే, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు సలహాదారు పి. సుదర్శన్‌రెడ్డి, పెద్దపల్లి జిల్లాలో తెలంగాణ శాసనసభ ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావు, రాజన్న సిరిసిల్ల జిల్లాలో తెలంగాణ శాసనసభ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. అదేవిధంగా రంగారెడ్డి జిల్లాలో ఐటీ, పరిశ్రమలు, వాణిజ్య శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, సంగారెడ్డి జిల్లాలో ఆరోగ్యం, వైద్యం, కుటుంబ సంక్షేమం, శాస్త్ర సాంకేతిక శాఖల మంత్రి దామోదర రాజనర్సింహ, సిదిపేట జిల్లాలో రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ శ్రీమతి కొతకొట సీత దయాకర్‌రెడ్డి, సూర్యాపేట జిల్లాలో నీటిపారుదల, ఆహారం-పౌర సరఫరాల శాఖల మంత్రి నలమాడ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వికారాబాద్ జిల్లాలో తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, వనపర్తి జిల్లాలో తెలంగాణ శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, వరంగల్ జిల్లాలో తెలంగాణ ప్రణాళికా మండలి వైస్ చైర్మన్ శ్రీమతి గద్వాల్ విజయలక్ష్మి, యాదాద్రి భువనగిరి జిల్లాలో తెలంగాణ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనం స్వీకరించనున్నారు. ఇదే విధంగా మహబూబ్‌నగర్, నల్గొండ, నారాయణపేట, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, రంగారెడ్డి, సంగారెడ్డి, సిద్ధిపేట, సూర్యాపేట, వికారాబాద్, వనపర్తి, వరంగల్, యాదాద్రి భువనగిరి జిల్లాల్లోనూ ప్రభుత్వం నియమించిన ప్రముఖుల ఆధ్వర్యంలో ప్రజా పాలన దినోత్సవ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పట్టణ స్థానిక సంస్థలు, గ్రామ పంచాయతీల్లో జాతీయ పతాకాన్ని ఎగురవేయాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. జిల్లా కలెక్టర్లు, జిల్లా మేజిస్ట్రేట్లు కార్యక్రమాలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపట్టి తగిన రీతిలో వేడుకలు నిర్వహించాలని ఆదేశించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశాలపై సాధారణ పరిపాలన శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. సంబంధిత మంత్రులు, ప్రముఖుల వ్యక్తిగత కార్యదర్శులకు సమాచారం అందించి, కార్యక్రమాల నిర్వహణకు అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా యంత్రాంగాన్ని ప్రభుత్వం ఆదేశించింది.








## యువ ఆపద మిత్ర శిక్షణలో కేయూసీఈటీ
# ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు

**కేయూ క్యాంపస్, 16 సెప్టెంబర్, జై భీమ్ న్యూస్:**

కాకతీయ విశ్వవిద్యాలయం యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (కేయూసీఈటీ)కి చెందిన 10 మంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు 'యువ ఆపద మిత్ర' శిక్షణ కార్యక్రమానికి ఎంపికై శిక్షణ పొందుతున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎన్. రమణ తెలిపారు. ఎస్‌డీఆర్ఎఫ్--టీజీఎస్పీ, హనుమకొండ జిల్లా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వారం రోజుల శిక్షణ కార్యక్రమం సెప్టెంబర్ 16 నుంచి 22వ తేదీ వరకు మామ్నూర్‌లోని 4వ బెటాలియన్ తెలంగాణ స్పెషల్ పోలీస్ ప్రాంగణంలో కొనసాగుతోంది. విపత్తులు సంభవించిన సమయంలో ప్రజలకు తక్షణ సహాయం అందించేందుకు అవసరమైన విపత్తు నిర్వహణ, అత్యవసర స్పందన, రక్షణ చర్యలు, ప్రథమ చికిత్స తదితర అంశాలపై వాలంటీర్లకు శిక్షణ అందిస్తున్నారు. ఆకస్మిక విపత్తుల సమయంలో సమర్థవంతంగా స్పందించేలా యువతను సన్నద్ధం చేయడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని కాకతీయ విశ్వవిద్యాలయ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈ. నారాయణ పర్యవేక్షిస్తుండగా, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు డా.డి. శైలజ, డా.ఎం. సౌజన్య సమన్వయం చేస్తున్నారు. శిక్షణకు ఎంపికైన ఎన్ఎస్ఎస్ వాలంటీర్లను కేయూసీఈటీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎన్. రమణతో పాటు బోధనా, బోధనేతర సిబ్బంది అభినందించారు.

## కేయూ జంతుశాస్త్ర
# విభాగానికి పేటెంట్




- పరిశోధనలో మరో మైలురాయి

**కేయూ క్యాంపస్, 16 సెప్టెంబర్, (జై భీమ్ న్యూస్)**

కాకతీయ విశ్వవిద్యాలయం జంతుశాస్త్ర విభాగం పరిశోధనలో మరో మైలురాయిని సాధించింది. విభాగానికి చెందిన ఆచార్య జి. షమితా, పరిశోధకురాలు, విశ్వవిద్యాలయ పూర్వ విద్యార్థిని మౌనికా జే., హైదరాబాద్‌లోని సెయింట్ ఫ్రాన్సిస్ కళాశాల మైక్రోబయాలజీ విభాగ సహాయ ఆచార్యురాలు గాయత్రీ సంయుక్తంగా చేపట్టిన వినూత్న పరిశోధనకు భారత ప్రభుత్వ పేటెంట్ మంజూరైంది. "టస్సర్ సిల్క్‌వార్మ్ గట్ బ్యాక్టీరియా నుంచి యాంటీమైక్రోబయల్ సిల్వర్ నానో పార్టికల్స్ తయారీ" అనే ఆవిష్కరణకు పేటెంట్ నంబర్ 59 6905 లభించింది. ఈ పేటెంట్ కోసం 2025 ఆగస్టు 25న దరఖాస్తు చేయగా, 2026 జూలై 27న మంజూరైనట్లు ఆచార్య జి. షమితా తెలిపారు. ఈ ఆవిష్కరణ ద్వారా టస్సర్ సిల్క్‌వార్మ్‌కు సోకే వ్యాధులను నియంత్రించడంతో పాటు పట్టు ఉత్పత్తిని పెంచే అవకాశం ఉందని తెలిపారు. తద్వారా సుస్థిరమైన సెరికల్చర్ అభివృద్ధికి ఈ పరిశోధన దోహద పడుతుందని పేర్కొన్నారు. శాస్త్రీయ పరిశోధనలను సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణలుగా మలచడంలో ఈ పేటెంట్ ఒక ముఖ్యమైన ముందడుగని ఆచార్య షమితా తెలిపారు. ఈ సందర్భంగా కాకతీయ విశ్వవిద్యాలయ వైస్‌చాన్స్‌లర్ ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం, సైన్స్ విభాగాల డీన్, ఓఎస్డీ ఆచార్య బి. వెంకట్రామరెడ్డి పేటెంట్ పొందిన పరిశోధకులను అభినందించారు. విభాగాధిపతి ఆచార్య వై. వెంకయ్య, ఆచార్య మామిడాల ఇస్తారి, ఆచార్య ఈసం నారాయణతో పాటు పలువురు బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

# రెండు దశాబ్దాల తర్వాత ఐటీడీఏకు కొత్త పీఆర్వో

- ఏటూరునాగారం ఐటీడీఏలో పబ్లిక్ రిలేషన్స్ అధికారిగా స్రవంతికి అదనపు బాధ్యతలు




**ఏటూరునాగారం, సెప్టెంబర్ 16, జై భీమ్ న్యూస్ :**

ఏటూరునాగారం ఐటీడీఏలో దాదాపు రెండు దశాబ్దాల తర్వాత పబ్లిక్ రిలేషన్స్ అధికారిగా కొత్తగా బాధ్యతలు అప్పగించారు. తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ పరిధిలోని ఐటీడీఏ ఏటూరునాగారం ప్రాజెక్టు అధికారి లెనిన్ వత్సల్ టోప్పో, ఐఏఎస్ జారీ చేసిన ఉత్తర్వుల మేరకు హెచ్ఎన్‌టీసీ ఐటీడీఏ ఏటూరునాగారంలో జూనియర్ అసిస్టెంట్ కమ్ స్టోర్ కీపర్‌గా విధులు నిర్వహిస్తున్న టి. స్రవంతికి పబ్లిక్ రిలేషన్స్ అధికారిగా అదనపు బాధ్యతలు అప్పగించారు. గతంలో జిల్లా స్టాఫ్ రిపోర్టర్‌గా పనిచేసిన స్రవంతికి ఉన్న వార్తా రంగ అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ బాధ్యతలు అప్పగించినట్లు తెలుస్తోంది. ఐటీడీఏతో పాటు దాని పరిధిలోని యూనిట్లకు సంబంధించిన వార్తలను ప్రతిరోజూ పర్యవేక్షించి, తెలుగు దినపత్రికల్లో ప్రచురితమయ్యే వార్తా కథనాల క్లిప్పింగులను ప్రాజెక్టు అధికారికి సమర్పించాల్సి ఉంటుంది. అలాగే ఐటీడీఏకు సంబంధించిన వార్తల్లో అవసరమైన సమాచారాన్ని సంబంధిత అధికారులు, సిబ్బంది నుంచి సేకరించి నివేదికలు, రీజాయిండర్లు సిద్ధం చేయడం, అధికారుల సూచనల మేరకు వాటిని సంబంధిత సంస్థలకు పంపించడం వంటి బాధ్యతలను నిర్వహించనున్నారు. ముఖ్యంగా ప్రతికూల వార్తా కథనాలపై సంబంధిత అధికారులు, సిబ్బందితో సంప్రదింపులు జరిపి అవసరమైన సమాచారాన్ని సేకరించి, లీగల్ సెల్ ఇన్‌చార్జి మార్గదర్శకత్వంలో రీజాయిండర్లు, నివేదికలను సిద్ధం చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ ప్రక్రియకు సంబంధించిన రికార్డును ప్రత్యేకంగా నిర్వహించాలని ప్రాజెక్టు అధికారి ఆదేశించారు. స్రవంతి తన సాధారణ విధులతో పాటు పీఆర్వోగా అదనపు బాధ్యతలను నిర్వర్తించనున్నారు. ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పనులు, ప్రభుత్వ పథకాలు, అధికారిక కార్యక్రమాలకు సంబంధించిన సమాచారాన్ని మీడియాకు చేరవేయడం, మీడియా సంస్థలతో సమన్వయం చేయడం వంటి అంశాల్లో ఈ బాధ్యతలు కీలకంగా మారనున్నాయి. ఈ నియామక ఉత్తర్వుల ప్రతులను లీగల్ సెల్ ఇన్‌చార్జి, ఏపీవో/ఏవో/ఓఎం, జిల్లా పబ్లిక్ రిలేషన్స్ అధికారి ములుగుకు తదితర సంబంధిత అధికారులకు పంపించారు. దాదాపు 20 ఏళ్ల తర్వాత ఐటీడీఏ ఏటూరునాగారంలో పీఆర్వో బాధ్యతలు అధికారికంగా కేటాయించడం చర్చనీయాంశంగా మారింది. గతంలో జిల్లా స్టాఫ్ రిపోర్టర్‌గా పనిచేసిన స్రవంతికి ఇప్పుడు ఐటీడీఏలోనే పబ్లిక్ రిలేషన్స్ బాధ్యతలు రావడం విశేషంగా నిలిచింది.

## 'కల్పిత నాయకుడు' పుస్తకంపై కేయూ ఎస్సీ, ఎస్టీ
# ఎంప్లాయీస్ అసోసియేషన్ ఖండన



**కేయూ క్యాంపస్, 16 సెప్టెంబర్, (జై భీమ్ న్యూస్)**

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ వ్యక్తిత్వం, ఆశయాలను కించపరిచేలా 'హమారా ప్రసాద్' రచించినట్లు పేర్కొంటున్న 'కల్పిత నాయకుడు' పుస్తకాన్ని కాకతీయ యూనివర్సిటీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ తీవ్రంగా ఖండించింది. కాకతీయ యూనివర్సిటీ గెస్ట్‌హౌస్‌లో ప్రొఫెసర్ ఈసం నారాయణ అధ్యక్షతన అసోసియేషన్ అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పుస్తకంపై ఏకగ్రీవంగా నిరసన వ్యక్తం చేస్తూ పలు తీర్మానాలు చేశారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ పుల్లా శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రపంచవ్యాప్తంగా డాక్టర్ అంబేడ్కర్‌కు లభిస్తున్న గౌరవాన్ని ఓర్చుకోలేని శక్తులు ఆయన ప్రతిష్ఠను దెబ్బతీసే ప్రయత్నాలు చేస్తున్నాయని ఆరోపించారు. అంబేడ్కర్ ఒక కులానికే పరిమితమైన వ్యక్తి కాదని, ప్రజాస్వామ్యం, సమానత్వం, సామాజిక న్యాయం కోసం కీలక కృషి చేసిన యుగపురుషుడని పేర్కొన్నారు. 'కల్పిత నాయకుడు' పుస్తకాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని అసోసియేషన్ డిమాండ్ చేసింది. పుస్తకంలోని అంశాలపై చట్టపరమైన విచారణ జరిపి, నిబంధనలకు విరుద్ధంగా ఉన్నట్లయితే సంబంధిత వ్యక్తులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరింది. ప్రభుత్వం తక్షణమే స్పందించకపోతే కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఉద్యోగ, విద్యార్థి, బహుజన సంఘాలను సమన్వయం చేసి రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని నాయకులు హెచ్చరించారు. సమావేశంలో అసోసియేషన్ నాయకులు పి. భాస్కర్, ఎన్. కిరణ్‌కుమార్, బి. రాజు, డి. ఆనందం, బొక్క మొగిలి తదితరులు పాల్గొన్నారు



## ఐటిఐ భూమిని
# అమ్మవద్దని డిమాండ్

- సిపిఎం, సిపిఎంఎల్, సిఐటియు కార్యకర్తల నిరసన

**బెంగళూరు జై భీమ్ న్యూస్ :**

'ఐటిఐకి చెందిన భూమిని అమ్మాలన్న ప్రతిపాదనను వెంటనే విరమించుకోవాలి,' అని బెంగళూరు నగరంలోని ఐటిఐ భవనం ముందు సిపిఎం, సిపిఎంఎల్, సిఐటియు కార్యకర్తలు నిరసన తెలిపారు. 'నగరంలోని సుమారు 22వేల మందికి ఉద్యోగాలు ఇచ్చింది. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం ఈ సంస్థను అమ్మాలని యోచిస్తోంది. 44.03 ఎకరాల భూమి వేలం ప్రక్రియ సెప్టెంబర్ 16న జరగనుంది, దానిని రద్దు చేయాలి,' అని సిఐటియు రాజ్య ఉపాధ్యక్షుడు గోపాలగౌడ అన్నారు. నగర పారిశ్రామిక చరిత్రలో ఒక ముఖ్యమైన రికార్డుగా నిలిచిన ఈ భూమిని, తరతరాల కార్మికుల రూ.1,685.40 కోట్ల పారిశ్రామిక సామర్థ్యానికి అమ్మే ప్రయత్నం విచారకరమని వారు పేర్కొన్నారు. 1948లో స్థాపించబడిన ఐటీఐ, దేశంలోనే మొట్టమొదటి ప్రభుత్వ రంగ సంస్థ. దీనిని ఒక చిహ్నంగా మార్చారు. అటువంటి సంస్థను వివిధ స్థిరాస్తి ఆస్తులుగా మార్చడం సరికాదని ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ భూముల నగదీకరణ విధానం, ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటీకరించడానికి చేసే రహస్య ప్రయత్నం కాకూడదు. భూమిని అమ్మడం వల్ల సమస్యలు పరిష్కారం కావు. దానికి బదులుగా, భూమి పునరుద్ధరణ, సాంకేతిక ఆధునీకరణ, విస్తరణ, సురక్షితమైన ఉపాధి కల్పన కోసం ఒక పటిష్టమైన ప్రణాళికను రూపొందించాలని ఆయన ఉద్ఘాటించారు. ఈ సందర్భంగా ఐఈఎన్ఓజేయూ రాజ్య వర్కింగ్ ప్రెసిడెంట్ శ్యామన్న రెడ్డి, ఏఐసీసీటీయూ రాష్ట్ర ప్రెసిడెంట్ అప్పన్న, సీపీఐఎం కార్యదర్శి బోర్డు సభ్యురాలు గౌరమ్మ, ఎం. సంబేగౌడ, కన్నల్లి కృష్ణప్ప, మునిమరప్ప, శరణప్ప, రమేష్, రాజేశ్వరి, కల్పన, వెంకటేష్ పాల్గొన్నారు.

## రుణాల మంజూరుపై
# బ్యాంకులు దృష్టి పెట్టాలి


మొదటిపేజీ తరువాయి

బ్యాంకులు ముందుకు రావాలని సీఎం సూచించారు. స్వయం సహాయక సంఘాల మహిళలు రుణాల చెల్లింపుల్లో ఆదర్శంగా నిలుస్తున్నారని ప్రశంసించారు. ఏపీలో స్వయం సహాయక సంఘాల మహిళలు రుణాల తిరిగి చెల్లింపుల్లో దేశంలోనే మొదటి స్థానంలో ఉన్నారని తెలిపారు. రుణాలు తీసుకున్న మహిళల్లో 99 శాతానికి పైగా సమయానికి చెల్లింపులు చేస్తున్నారని, కేవలం 0.67 శాతం మంది మాత్రమే చెల్లింపుల్లో విఫలమవుతున్నారని చెప్పారు. రుణాల చెల్లింపుల్లో విఫలమైన వారి నుంచి బకాయిల రికవరీపై బ్యాంకులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఇందుకోసం వన్‌టైమ్ సెటిల్‌మెంట్ (ఓటీఎస్) విధానాన్ని పరిశీలించాలని బ్యాంకర్లకు సీఎం చంద్రబాబు సూచించారు.

# అక్రమ నిర్బంధాలు ఇంకెన్నాళ్లు..?

జై భీమ్ న్యూస్ । ప్రత్యేక కథనం

- ప్రశ్నిస్తే అరెస్టా?
- తెలంగాణలో ప్రజల గొంతుకలపై ఉక్కుపాదమా?
- విద్యార్థులు.. మేధావులు.. నిరుద్యోగులు.. ఉద్యమకారులు.. టార్గెట్టా?
- అక్రమ అరెస్టుల తాకిళ్లను తట్టుకోలేక తల పట్టుకుంటున్న పోలీసులు?
- ప్రత్యేక కథనం: రఘు గొర్రెకుంట



**వరంగల్‌జిల్లా, జై భీమ్ న్యూస్ :** తెలంగాణ రాష్ట్రంలో ఇప్పుడు ఎక్కడచూ సినా ఒకటే చర్చ వినిపిస్తోంది. ప్రశ్నిస్తే అరె స్టు చేస్తారా? నోరు తెరిస్తే కేసు పెడతా రా? ప్రజా సమస్యలు చెబితే నిర్బంధిస్తారా? ప్రజా సమస్యలపై గొంతెత్తే విద్యార్థులు, మేధావులు, నిరుద్యోగులు, ఉద్యమకారులు, రైతు సంఘాల నాయకులు, కార్మిక సంఘాల ప్రతినిధులు, గ్రామస్థాయి నాయకులు స్థానిక ప్రజాప్రతినిధులు, సామాన్య పౌరులపై ముందస్తు అరెస్టులు, నిర్బంధాలు జరుగుతున్నాయనే ఆరోపణలు రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. ఏదైనా మంత్రి పర్యటన, ప్రభుత్వ కార్యక్రమం, ప్రజా సమావేశం లేదా నిరసనకు పిలుపు వస్తే చాలు.. ఆ కార్యక్రమానికి ముందే కొందరిని ఇళ్ల వద్ద నుంచి అదుపులోకి తీసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో సామాన్య ప్రజల్లో ఒక భయం నెలకొంటోందని ప్రజా సంఘాలు అంటున్నాయి. ప్రశ్నిస్తే అరెస్టా? గొంతెత్తితే కేసా? ప్రజా సమస్యలు చెప్పినందుకు నిర్బంధమా?

**ప్రజాస్వామ్యమా.. పోలీసు రాజ్యమా?**

ప్రజాస్వామ్యంలో ప్రభుత్వం ప్రజలకు జవాబుదారీగా ఉండాలి. ప్రజలు తమ బాధలను చెప్పుకోవడం, ప్రభుత్వ విధానాలను ప్రశ్నించడం, విమర్శించడం, శాంతి యుతంగా నిరసన తెలియజేయడం ప్రజాస్వామ్య వ్యవస్థలో సహజమైన ప్రక్రియ. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(ఏ) పౌరులకు భావప్రకటన స్వేచ్ఛను కల్పిస్తుంది. అలాగే ఆర్టికల్ 19(1)(బి) ప్రకారం శాంతియుతంగా, ఆయుధాలు లేకుండా సమావేశమయ్యే హక్కు ఉంది. అయితే ఈ హక్కులకు ప్రజా శాంతి, భద్రత వంటి అంశాల దృష్ట్యా చట్టబద్ధమైన పరిమితులు ఉండవచ్చు. కానీ ఆ పరిమితులు విధించినప్పుడు అవి చట్టబద్ధమైనవా? అవసరమైనవా? పరిస్థితికి అనుపాతంలో ఉన్నాయా? అనే ప్రశ్నలు కూడా తలెత్తుతాయి.ప్రజాస్వామ్యంలో సమస్యపై చర్చించకుండా, సమస్యకు పరిష్కారం చూపకుండా, సమస్య చెప్పిన వ్యక్తినే అదుపులోకి తీసుకుంటే ఎలా? అరెస్టు చేసి ఉదయం నుంచి సాయంత్రం వరకు పోలీస్ స్టేషన్‌లో కూర్చోబెట్టి, కార్యక్రమం ముగిసిన తర్వాత విడుదల చేసే చర్యలపై ప్రజలు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. ప్రతి ముందస్తు అరెస్టుకు చట్టబద్ధమైన కారణం ఏమిటి? ఏ శాంతిభద్రతల ముప్పును నివారించడానికి చర్య తీసుకున్నారు? ఏ ఆధారాలపై వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు? అనే వివరాలు ప్రజలకు స్పష్టంగా తెలియాల్సిన అవసరం ఉంది.

**పుస్తకాలు పట్టాల్సిన చేతులకు సంకెళ్లా?**

ఈ ముందస్తు అరెస్టుల వ్యవహారంలో ఎక్కువగా ప్రభావితమవుతున్నది విద్యార్థి లోకమేనని విమర్శలు వినిపిస్తున్నాయి. స్కాలర్‌షిప్‌లు రావడం లేదని, ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్‌లో ఉందని, హాస్టళ్లలో కనీస సౌకర్యాలు లేవని, ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయాలని విద్యార్థులు ప్రశ్నిస్తే వారిపై కేసులు, పోలీసు నోటీసులు వస్తున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. పుస్తకాలు పట్టాల్సిన చేతులకు పోలీసు నోటీసులా? ఒక విద్యార్థిపై ఎఫ్ఐఆర్ నమోదైతే దాని ప్రభావం కేవలం ఆ రోజుతో ముగియదు. భవిష్యత్తులో విద్య, ఉద్యోగ అవకాశాలు, పోలీస్ వెరిఫికేషన్, పాస్‌పోర్ట్ తదితర అంశాలపై ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. విద్యార్థి కేవలం ప్రశ్న అడిగాడా? లేక నిజంగానే చట్టాన్ని ఉల్లంఘించి నేరానికి పాల్పడ్డాడా? అనే తేడాను గుర్తించాల్సిన అవసరం ఉందని విద్యావేత్తలు పేర్కొంటున్నారు. ప్రశ్నించే విద్యార్థిని అణచివేయడం అంటే భవిష్యత్తు తరాన్ని అణచివేయడమే అని ప్రజా సంఘాలు అంటున్నాయి.

**ఉద్యమకారుల గొంతుకకు అడ్డుకట్ట ఎందుకు?**

రైతుల సమస్యలు, నిరుద్యోగుల ఆవేదన, కార్మికుల కష్టాలు, దళితులు, గిరిజనుల హక్కులు, విద్యార్థుల సమస్యలు, ప్రజా సంక్షేమ అంశాల కోసం పోరాడే ఉద్యమకారుల పరిస్థితిపైనా ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రజా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడమే ఉద్యమకారుల ప్రధాన ఉద్దేశమని వారి వర్గాలు చెబుతున్నాయి. కానీ ఉద్యమానికి పిలుపునిచ్చిన వెంటనే నాయకులను, కార్యకర్తలను ఇళ్ల నుంచే అర్ధరాత్రి అదుపులోకి తీసుకుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఉద్యమానికి కారణమైన అసలు సమస్యను పరిష్కరించకుండా ఉద్యమకారుడిని అరెస్టు చేస్తే సమస్య సమసిపోతుందా? శాంతియుతంగా, రాజ్యాంగబద్ధంగా జరగాల్సిన ఆందోళనలకు కూడా అనుమతులు నిరాకరించి, బలవంతంగా అరెస్టులు చేస్తున్నారనే ఆరోపణలు నిజమైతే వాటిపై ప్రభుత్వం స్పష్టమైన వివరణ ఇవ్వాల్సిన అవసరం ఉంది.

**కుటుంబ పరిస్థితులను పట్టించుకోకుండా ఇళ్ల నుంచి లాక్కెళ్తున్నారనే ఆరోపణలు**

ముందస్తు అరెస్టుల పేరుతో కొందరిని వారి కుటుంబ పరిస్థితులను కూడా పరిగణనలోకి తీసుకోకుండా ఇళ్ల నుంచి తీసుకెళ్తున్నారని బాధిత వర్గాలు ఆరోపిస్తున్నాయి. ఇంట్లో వృద్ధులు ఉన్నా.. చిన్నపిల్లలు ఉన్నా.. కుటుంబ సభ్యులు అనారోగ్యంతో ఉన్నా.. కనీస సమాచారం ఇవ్వకుండా వ్యక్తులను తీసుకెళ్లడం ఎంతవరకు సమంజసమనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఒక వ్యక్తిపై చట్టపరమైన చర్య అవసరమైతే అది చట్టం నిర్దేశించిన విధానంలోనే జరగాలి. అరెస్టుకు కారణం ఏమిటి? ఏ కేసు కింద చర్య తీసుకుంటున్నారు? ఏ ప్రమాదాన్ని నివారించడానికి నిర్బంధిస్తున్నారు? అనే వివరాలు బాధిత కుటుంబాలకు స్పష్టంగా తెలియాల్సిన అవసరం ఉంది.

**గ్రామాల గొంతుకలపై పోలీసు పహారా ఎందుకు?**

గ్రామాల్లో అభివృద్ధి జరగడం లేదని, రోడ్లు అధ్వాన్నంగా ఉన్నాయని, తాగునీరు సరిగా రావడం లేదని, పారిశుద్ధ్యం లోపించిందని, ఉపాధి హామీ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, గ్రామ పంచాయతీ నిధులు విడుదల కావడం లేదని ప్రశ్నించే మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, స్థానిక నాయకులను కూడా ముందస్తు అరెస్టుల పేరుతో అదుపులోకి తీసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రామ సమస్యలు చెప్పడం తప్పా? ప్రజల తరపున ప్రశ్నించడం నేరమా? గ్రామస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండే నాయకులను పోలీస్ స్టేషన్ల చుట్టూ తిప్పితే సామాన్యుడి సమస్యలు ఎవరికి చెప్పుకోవాలి? ఒక వ్యక్తి చట్టాన్ని ఉల్లంఘిస్తే చట్టం ప్రకారం చర్య తీసుకోవచ్చు. కానీ ఒక వ్యక్తి గ్రామస్థాయి నాయకులను కావడం, కావడం లేదా ప్రజా సమస్యలపై మాట్లాడటం మాత్రమే చర్యకు కారణం కాకూడదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**నేరం నిరూపించకముందే నిర్బంధమా?**

చట్టపరంగా ప్రివెంటివ్ డిటెన్షన్ లేదా ముందస్తు నిర్బంధం అనేది శిక్ష విధించే ప్రక్రియ కాదు. భవిష్యత్తులో నిర్దిష్ట పరిస్థితుల్లో శాంతిభద్రతలకు భంగం కలగకుండా ముందస్తు చర్యగా కొన్ని చట్టాల కింద దీనికి అవకాశం ఉంటుంది. అయితే కేవలం అనుమానం పేరుతో, స్పష్టమైన చట్టపరమైన ఆధారం లేకుండా చర్యలు తీసుకుంటున్నారనే ఆరోపణలు వస్తే వాటిపై సమగ్ర పరిశీలన అవసరం. వాట్సాప్ మెసేజ్‌లు, ఫోన్ కాల్స్ లేదా ఇతర సమాచారాన్ని ఆధారంగా తీసుకున్నట్లయితే వాటి చట్టపరమైన ప్రామాణికత ఏమిటి? ఎలాంటి నిఘా సమాచారం ఉంది? ఏ ప్రమాదాన్ని నివారించాల్సి వచ్చింది? అనే ప్రశ్నలకు సమాధానాలు అవసరం. ఎవరిని ఎందుకు అరెస్టు చేశారు? ఏ ప్రమాదాన్ని నివారించారు? ఆ ప్రమాదానికి సంబంధించిన ఆధారాలేమిటి? అనే వివరాలను చట్టబద్ధమైన ప్రక్రియలో సంబంధిత వ్యక్తులకు తెలియజేయాల్సిన అవసరం ఉంది.

**ఎఫ్ఐఆర్.. కస్టడీ.. విడుదల.. ఆ తర్వాత కూడా వేధింపులా?**

ఒక వ్యక్తిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడం దర్యాప్తులో ఒక భాగం కావచ్చు. అయితే ఎఫ్ఐఆర్ నమోదైనంత మాత్రాన ఆ వ్యక్తి నేరస్తుడిగా నిర్ధారించబడినట్లు కాదు. నేరం నిరూపించబడే వరకు చట్టపరమైన ప్రక్రియ కొనసాగుతుంది. దర్యాప్తు అవసరమైతే చట్టబద్ధమైన నోటీసులు ఇచ్చి, నిర్దేశిత విధానంలో విచారణ జరపాలి. కానీ అరెస్టు చేసి విడుదల చేసిన తర్వాత కూడా మళ్లీ మళ్లీ పోలీస్ స్టేషన్‌కు పిలవడం, విచారణ పేరుతో గంటల తరబడి కూర్చోబెట్టడం, కుటుంబ సభ్యులను భయపెట్టడం, ఫోన్లలో ట్రాక్ చేస్తున్నామని బెదిరించడం వంటి



ఆరోపణలు వస్తున్నాయి. ఇలాంటి ఆరోపణలు నిజమైతే వాటిపై ఉన్నతాధికారులు పారదర్శకంగా విచారణ జరిపి వాస్తవాలను ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉంది.

**హక్కులు అడిగితే హద్దులు పెడతారా?**

భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 సమానత్వ సూత్రాన్ని ప్రతిపాదిస్తుంది. ఆర్టికల్ 19(1)(ఏ) భావప్రకటన స్వేచ్ఛను, ఆర్టికల్ 19(1)(బి) శాంతియుత సమావేశ హక్కును కల్పిస్తుంది. అలాగే ఆర్టికల్ 21 ప్రకారం వ్యక్తి జీవితం మరియు వ్యక్తిగత స్వేచ్ఛకు చట్టబద్ధమైన రక్షణ ఉంది. అయితే ఈ హక్కులు పూర్తిగా పరిమితిలేనివి కావు. చట్టం అనుమతించే సందర్భాల్లో, నిర్దిష్ట విధానాల ప్రకారం పరిమితులు విధించవచ్చు. అందుకే ఏదైనా అరెస్టు లేదా నిర్బంధం జరిగినప్పుడు చట్టపరమైన ఆధారం ఉందా? నిర్దేశిత ప్రక్రియ పాటించబడిందా? తీసుకున్న చర్య అవసరమైనదేనా? ఆ చర్య పరిస్థితికి అనుపాతంలో ఉందా? అనే అంశాలు పరిశీలించాల్సి ఉంటుంది. హక్కులు అడిగిన ప్రతి ఒక్కరినీ అణచివేస్తే ప్రజాస్వామ్యానికి, పోలీసు రాజ్యానికి మధ్య తేడా ఏముంటుందనే ప్రశ్న ప్రజల్లో వినిపిస్తోంది.

**రాజకీయ ఒత్తిళ్లతోనే ముందస్తు అరెస్టులా?**

కొన్ని సందర్భాల్లో రాజకీయ నాయకుల ఒత్తిళ్ల కారణంగానే పోలీసులు ముందస్తు అరెస్టులకు పూనుకుంటున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. అయితే ఇలాంటి ఆరోపణలను నిర్ధారించడానికి స్పష్టమైన ఆధారాలు అవసరం. సంబంధిత ఆరోపణలపై ప్రభుత్వం, పోలీసు శాఖ అధికారికంగా స్పందించి వాస్తవాలను ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉంది. పోలీసులు చట్టం ప్రకారమే వ్యవహరిస్తు న్నారా? లేక రాజకీయ ఒత్తిళ్ల ప్రభావం ఉందా? అనే ప్రశ్నలకు సమాధానం అవసరం.

**ఒత్తిళ్లు తట్టుకోలేక తలలు పట్టుకుంటున్న పోలీసు అధికారులు?**

పోలీసు శాఖలో పనిచేస్తున్న అధికారులపై కూడా వివిధ స్థాయిల నుంచి ఒత్తిళ్లు ఉంటున్నాయనే చర్చ జరుగుతోంది. ఒక వైపు శాంతిభద్రతలను కాపాడాల్సిన బాధ్యత.. మరోవైపు పరిపాలనా, రాజకీయ ఒత్తిళ్లు ఉంటే అధికారులు ఎలాంటి పరిస్థితులను ఎదుర్కొంటున్నారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అయితే ఈ అంశంపై పోలీసు శాఖ నుంచి అధికారికంగా స్పష్టమైన సమాచారం వెలువడాల్సి ఉంది. చట్టాన్ని అమలు చేసే అధికారులే ఒత్తిడికి గురవుతున్నారనే ఆరోపణలు ఉంటే.. వాటిపై కూడా పారదర్శకమైన విచారణ అవసరం కాదా? అనే ప్రశ్న ప్రజల్లో వినిపిస్తోంది.

**గత్యంతరం లేక అరెస్టులతో సరిపెట్టుకుంటున్నారా ఖాకీలు?**

ప్రజా సమస్యలకు పరిష్కారం చూపాల్సిన సమయంలో సమస్యను లేవనెత్తిన వ్యక్తిని అదుపులోకి తీసుకోవడం ద్వారా అసలు సమస్య పరిష్కారం కాదని ప్రజా సంఘాలు విమర్శిస్తున్నాయి. విద్యార్థులకు విద్య కావాలి. నిరుద్యోగులకు ఉద్యోగాలు కావాలి. రైతులకు భరోసా కావాలి. కార్మికులకు రక్షణ కావాలి. గ్రామాలకు రోడ్లు, తాగునీరు, పారిశుద్ధ్యం కావాలి. ప్రజలకు సంక్షేమం, మౌలిక సదుపాయాలు కావాలి. ఈ సమస్యలపై ప్రశ్నిస్తే సమాధానం చర్చ కావాలి.. అరెస్టు కాదు అని ప్రజా సంఘాలు అంటున్నాయి.

**అరెస్టులతో సమస్యలు సమసిపోతాయా? ప్రజల ఆవేదనకు సమాధానం ఎవరు?**

ఒకరిని అరెస్టు చేయవచ్చు.. ఒకరిని నిర్బంధించవచ్చు.. కానీ ప్రజల సమస్యలను మాత్రం అరెస్టు చేయలేరు. నిరుద్యోగం గురించి అడిగే ప్రశ్నను అరెస్టు చేయలేరు. విద్యార్థుల ఆవేదనను నిర్బంధించలేరు. గ్రామ సమస్యలను పోలీస్ స్టేషన్‌లో బంధించలేరు. రైతుల కష్టాలకు తాళాలు వేయలేరు. ప్రజల ఆకాంక్షలకు సంకెళ్లు వేయలేరు. ప్రజాస్వామ్యంలో సమస్యలకు పరిష్కారం చర్చ, సంభాషణ, విధానపరమైన చర్యల ద్వారానే రావాలి.

**సమగ్ర నివేదిక విడుదల చేయాలి**

తెలంగాణలోని అన్ని జిల్లాలు, మండలాల్లో ముందస్తు అరెస్టులు, నిర్బంధాలు, బైండోవర్ చర్యలపై ప్రభుత్వం పూర్తి వివరాలను ప్రజల ముందుంచాలని ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఎన్ని ముందస్తు అరెస్టులు జరిగాయి? ఎన్ని ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి? ఏ సెక్షన్ల కింద కేసులు పెట్టారు? ఎంత మందిని బైండోవర్ చేశారు? ఎంతమందిని కస్టడీలోకి తీసుకున్నారు? ఎంతమందిని విడుదల చేశారు? ఎన్ని కేసులు దర్యాప్తులో ఉన్నాయి? ఎన్ని కేసుల్లో చర్యలు తీసుకున్నారు? అనే పూర్తి వివరాలతో ప్రభుత్వం ఒక శ్వేతపత్రం లేదా సమగ్ర నివేదిక విడుదల చేయాలని ప్రజలు, ప్రజా సంఘాలు కోరుతున్నాయి. అధికారిక సమాచారం ప్రజలకు అందుబాటులో ఉంటేనే వాస్తవ పరిస్థితిపై స్పష్టత వస్తుంది.

**ప్రజల గొంతు వినండి.. సమస్యలు పరిష్కరించండి!**

ప్రభుత్వాన్ని ప్రశ్నించే ప్రతి వ్యక్తిని శత్రువుగా చూడాల్సిన అవసరం లేదు. చట్టాన్ని ఉల్లంఘిస్తే చట్టం తన పని తాను చేయాలి. అదే సమయంలో ప్రజా సమస్యలపై శాంతియుతంగా ప్రశ్నించే హక్కును కూడా గౌరవించాలి. విద్యార్థులు తమ భవిష్యత్తు కోసం ప్రశ్నిస్తే వారి సమస్యలను వినాలి. నిరుద్యోగులు ఉద్యోగాల కోసం అడిగితే వారి ఆవేదనను పరిగణనలోకి తీసుకోవాలి. ఉద్యమకారులు ప్రజా సమస్యలను తీసుకువస్తే వాటిపై చర్చించాలి. మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు గ్రామ సమస్యలను ప్రస్తావిస్తే వాటిపై స్పందించాలి. పోలీసులు శాంతిభద్రతలను కాపాడాలి. ప్రభుత్వం ప్రజలకు జవాబుదారీగా ఉండాలి. ప్రజలు కూడా చట్టాన్ని గౌరవించాలి. అప్పుడే ప్రజాస్వామ్య వ్యవస్థ మరింత బలపడుతుంది.

**జై భీమ్ న్యూస్ బహిరంగ ప్రశ్న**

ప్రశ్నించినందుకు అరెస్టులా?
ప్రజా సమస్యలు చెప్పినందుకు కేసులా?

విద్యార్థులు, మేధావులు, నిరుద్యోగులు, ఉద్యమకారులు, మాజీ సర్పంచులు, , ప్రజా సమస్యలపై గొంతెత్తే వారు చేసిన తప్పేంటి?, ముందస్తు అరెస్టులు, నిర్బంధా లకు చట్టబద్ధమైన కారణాలేమిటి?, ఏ శాంతి భద్రతల ముప్పును నివారించేం దుకు ఈ చర్యలు తీసుకున్నారు?

- ఎన్ని అరెస్టులు జరిగాయి?
- ఎన్ని ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి?
- ఎన్ని బైండోవర్ చర్యలు జరిగాయి?

రాజకీయ ఒత్తిళ్లతో అరెస్టులు చేస్తున్నారనే ఆరోపణలపై ప్రభుత్వం, పోలీసు శాఖ వివరణ ఇస్తుందా? పోలీసు అధికారులపై ఒత్తిళ్లు ఉన్నాయనే ఆరోపణలపై అధికారికంగా స్పందిస్తారా?కుటుంబ పరిస్థితులను పట్టించుకోకుండా ఇళ్ల నుంచి వ్యక్తులను తీసుకెళ్తున్నారనే ఆరోపణలపై ప్రభుత్వం ఏమంటుంది?ప్రశ్నించే గొంతులను అణచడం కాకుండా.. ప్రజల సమస్యలను వినే పాలన ఎప్పుడు?ఒక వ్యక్తిని అరెస్టు చేయడం ద్వారా ఒక కార్యక్రమాన్ని ఆపవచ్చు.. కానీ ప్రజల సమస్యను ఆపలేరు. ఒక గొంతును నిర్బంధించవచ్చు.. కానీ అదే ప్రశ్న మరో గొంతులో వినిపించకుండా చేయలేరు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వం ప్రశ్నలకు సమాధానం చెప్పాలి. పోలీసు వ్యవస్థ చట్టానికి లోబడి పనిచేయాలి. ప్రజల హక్కులు, చట్టబద్ధమైన పరిమితులు, శాంతిభద్రతలు ఈ మూడింటి మధ్య సమతుల్యత ఉండాలి.

**ప్రజాస్వామ్యంలో ప్రశ్నకు సమాధానం కావాలి.. అరెస్టు కాదు!**

ప్రజల గొంతు వినండి.. ప్రజా సమస్యలను పరిష్కరించండి.. చట్టబద్ధ పాలనను బలోపేతం చేయండి!

---

## 22ఏ నిషేధిత జాబితా వివాదాలకు పరిష్కారం

మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వం ప్రకటించింది.

పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను కమిటీ సమగ్రంగా పరిశీలించి, నిర్ణయించిన అర్హత ప్రమాణాల ఆధారంగా పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టనున్నారు.

**4. జీవో నంబర్ 59 దరఖాస్తుల పరిష్కారం**

జీవో నంబర్ 59 కింద కన్వేయన్స్ డీడ్స్ జారీ చేసిన 1,22,280 దరఖాస్తులను నిర్దేశిత అర్హతల ప్రకారం తుది పరిశీలన చేసి పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయనుంది. ఇక 18,590 పెండింగ్ దరఖాస్తులను నూతన క్రమబద్ధీకరణ విధానం కింద పరిష్కరించేలా చర్యలు తీసుకోనున్నట్లు ప్రభుత్వం తెలిపింది.

**5. జీవో నంబర్ 118పై పెండింగ్ కేసులకు పరిష్కారం**

ఎల్బీనగర్ నియోజకవర్గానికి సంబంధించిన జీవో నంబర్ 118 కింద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను నిర్ణీత గడువు లోగా పరిష్కరించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. పరిష్కరించిన కేసులను వెంటనే సెక్షన్ 22ఏ నిషేధిత జాబితా నుంచి తొలగించేలా చర్యలు తీసుకోనున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు.

**6. అసైన్డ్ భూములపై సమగ్ర న్యాయ సమీక్ష**

అసైన్డ్ భూముల సమస్యపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించనుంది. తెలంగాణ అసైన్డ్ భూముల (బదిలీ నిషేధ) చట్టం–1977 పరిధిలోకి ఈ భూములు వస్తున్న నేపథ్యంలో, అంశంపై సమగ్ర న్యాయ సమీక్ష నిర్వహించనున్నారు. అదేవిధంగా విస్తృత స్థాయిలో సంప్రదింపులు జరిపిన అనంతరం తగిన నిర్ణయం తీసుకుంటామని ప్రభుత్వం స్పష్టం చేసింది.

**7. ఇందిరమ్మ ఇళ్లకు కేటాయించిన ప్రభుత్వ స్థలాలు**

ప్రభుత్వం కేటాయించిన స్థలాల్లో ప్రభుత్వ నిధులతో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన అంశాన్ని కూడా ప్రభుత్వం పరిశీలించనుంది. ఇవి అత్యంత నిరుపేద కుటుంబాల ఆస్తులకు సంబంధించిన అంశాలైనందున విస్తృత స్థాయిలో సంప్రదింపులు జరిపి నిర్ణయం తీసుకుంటామని ముఖ్యమంత్రి తెలిపారు.

**8. సొంత స్థలాల్లో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లు**

లబ్ధిదారుల సొంత స్థలాల్లో ప్రభుత్వ ఆర్థిక సహాయంతో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల విషయంలో ఐదేళ్ల లాక్‌ఇన్ పీరియడ్ పూర్తయిన తర్వాత క్రయవిక్రయాలకు అనుమతి ఇచ్చే విధంగా చర్యలు తీసుకోనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. దీంతో ఇలాంటి ఆస్తులపై ఉన్న లావాదేవీల పరిమితుల సమస్యకు పరిష్కారం లభించే అవకాశం ఉంది.

**9. నాలా రుసుములు చెల్లించని పట్టా భూములు**

ప్రైవేటు పట్టా భూముల్లో నాలా రుసుములు చెల్లించని కారణంగా రిజిస్ట్రేషన్‌కు ఎదురవుతున్న సమస్యలను కూడా పరిష్కరించనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. నాలా ఛార్జీలతో పాటు స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ రుసుములను చెల్లించే విధంగా అవకాశం కల్పించి క్రయవిక్రయాలకు అనుమతించే చర్యలు తీసుకోనున్నట్లు వెల్లడించింది.

**10. ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలు, అనధికార లేఅవుట్లు**

ప్రభుత్వ భూముల్లో ఏర్పడిన ఆక్రమణలు, అనధికార లేఅవుట్లు, కాలనీల సమస్యను కూడా ప్రభుత్వం పరిశీలించనుంది. అర్హత కలిగిన కేసులను నూతన క్రమబద్ధీకరణ పథకం పరిధిలోకి తీసుకురావడం ద్వారా సమస్యకు పరిష్కారం చూపే దిశగా చర్యలు తీసుకోనున్నట్లు ప్రభుత్వం పేర్కొంది.

**11. సికింద్రాబాద్ లీజ్‌హోల్డ్ ఆస్తులకు ఫ్రీహోల్డ్**

సికింద్రాబాద్ పరిధిలోని లీజ్‌హోల్డ్ ఆస్తులను ఫ్రీహోల్డ్‌గా క్రమబద్ధీకరించే అంశంపైనా ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుంది. ఇలాంటి కేసులను 30 రోజుల నిర్దిష్ట వ్యవధిలో పరిష్కరించేందుకు అధికారులతో కూడిన ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు.

**12. స్వాతంత్ర్య సమరయోధులు, మాజీ సైనికులు, భూదాన్ భూములు**

స్వాతంత్ర్య సమరయోధులు, మాజీ సైనికులకు కేటాయించిన అసైన్డ్ భూములు, భూదాన్ భూములకు సంబంధించిన అంశాన్ని కూడా ప్రభుత్వం ప్రతిపాదిత విధానంలో పరిశీలించనుంది. నిరుపేదలు, బలహీన వర్గాల గృహ నిర్మాణ అవసరాలకు భూమి, ఆర్థిక వనరులను సమీకరించే ఉద్దేశంతో ఈ భూములను సమగ్ర ల్యాండ్ పూలింగ్ విధానం పరిధిలోకి తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు ముఖ్యమంత్రి వివరించారు. ఈ విధానం ద్వారా సమీకరించే నిధులను ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల్లోని నిరుపేద లబ్ధిదారులకు బలహీన వర్గాల గృహ నిర్మాణ పథకాల కోసం వినియోగించే ఉద్దేశం ఉందని తెలిపారు.

**పేదల ఆస్తులకు చట్టబద్ధమైన పరిష్కారమే లక్ష్యం**

22ఏ నిషేధిత జాబితాలో ఆస్తులు చేరడం వల్ల రిజిస్ట్రేషన్లు నిలిచిపోవడం, సంవత్సరాల తరబడి దరఖాస్తులు పెండింగ్‌లో ఉండటం వంటి సమస్యలు ఎదురవుతున్న నేపథ్యంలో ప్రభుత్వం గుర్తించిన 12 అంశాలపై తీసుకోబోయే నిర్ణయాలు కీలకంగా మారనున్నాయి. అయితే ప్రతి కేసును సంబంధిత చట్టాలు, అర్హతలు, భూమి స్వభావం, ప్రభుత్వ రికార్డులు, న్యాయపరమైన అంశాలను పరిశీలించిన తర్వాతే పరిష్కరించనున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. 22ఏ నిషేధిత జాబితా విషయంలో పేదలకు అన్యాయం జరగకుండా, అదే సమయంలో ప్రభుత్వ భూముల పరిరక్షణ, చట్టపరమైన నిబంధనలకు లోబడి పరిష్కారాలు చూపడమే ప్రభుత్వ ఉద్దేశంగా ముఖ్యమంత్రి సభలో వివరించారు.



## పర్యాటక దినోత్సవం నిర్వహణపై సమన్వయ కమిటీ సమావేశం

**వరంగల్, సెప్టెంబర్ 16 (జై భీమ్ న్యూస్)**

సెప్టెంబర్ 27న నిర్వహించనున్న ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని వరంగల్ జిల్లాలో చేపట్టాల్సిన వివిధ కార్యక్రమాలపై సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో పర్యాటక దినోత్సవ కార్యక్రమాల నిర్వహణకు సంబంధించిన అంశాలపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాటాడుతూ జిల్లాలోని ప్రముఖ పర్యాటక ప్రదేశాలు, చారిత్రక కట్టడాలు, సాంస్కృతిక ప్రదేశాల విశిష్టతను ప్రజలకు విస్తృతంగా పరిచయం చేసేలా ప్రపంచ పర్యాటక దినోత్సవ కార్యక్రమాలను నిర్వహించాలని అధికారులకు సూచించారు. జిల్లాకు ఉన్న పర్యాటక ప్రాధాన్యతను ప్రజలకు తెలియజేసే విధంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా నిర్వహించాల్సిన కార్యక్రమాలను వివిధ శాఖల అధికారులు పరస్పరం సమన్వయంతో చేపట్టాలని, కార్యక్రమాల విజయవంతమైన నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. పర్యాటక ప్రదేశాల చారిత్రక, సాంస్కృతిక, ప్రకృతి పరమైన విశిష్టతలను ప్రజలకు వివరించేలా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. అదేవిధంగా జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధికి ఉన్న అవకాశాలను గుర్తించి, పర్యాటకులను ఆకర్షించే విధంగా అవసరమైన చర్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. స్థానిక పర్యాటక ప్రదేశాలకు మరింత ప్రాచుర్యం కల్పించడం ద్వారా జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధికి దోహదపడే కార్యక్రమాలను సమన్వయంతో నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ విజయ లక్ష్మి, డిప్యూటీ కమిషనర్ ప్రసన్న రాణి, ఎల్‌డీఎం జీవన్, కలెక్టరేట్ సూపరింటెండెంట్ రంజిత్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ప్రాజెక్ట్ టెండర్ ప్రక్రియ వేగవంతం చేయాలి

- 15 రోజుల్లో టెండర్ ప్రక్రియ పూర్తి చేయాలని సీడీఎంఏ డాక్టర్ టీకే. శ్రీదేవి ఆదేశం

**హన్మకొండ, సెప్టెంబర్ 16 (జై భీమ్ న్యూస్)**



గ్రేటర్ వరంగల్ మహానగర పాలక సంస్థ పరిధిలో చేప ట్టనున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ ప్రాజెక్టుకు సంబంధి ంచిన టెండర్ ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర సీడీ ఎంఏ డాక్టర్ టీకే. శ్రీదేవి అధికారులను ఆదేశించారు. బుధ వారం హైదరాబాద్ నుంచి సీడీఎంఏ డాక్టర్ టీకే. శ్రీదేవి గ్రేటర్ వరంగల్ మహానగర పాలక సంస్థ అధికారులతో వీడి యో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్ అంశాలు, టెండర్ ప్రక్రియ, పనులను చేపట్టే విధానం తదితర అంశా లపై అధికారులతో సమీక్షించారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నుంచి గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేక అధికారి, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, కమిషనర్ టి. వెంకన్నతో పాటు ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ విభాగాల అధికారులు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీడీఎంఏ డాక్టర్ టీకే. శ్రీదేవి మాట్లాడుతూ గ్రేటర్ వరంగల్ మహానగర పరిధిలో నిర్మించనున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థకు రూపొందించిన డీపీఆర్‌కు సంబంధించిన అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలించి, అవసరమైన ప్రక్రియలను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. 15 రోజుల్లోగా టెండర్ ప్రక్రియను పూర్తి చేసి, ప్రాజెక్ట్ పనులు వేగంగా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రాజెక్ట్ అమలులో ఎలాంటి జాప్యం లేకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, అవసరమైన అనుమతులు, సాంకేతిక అంశాలు, ఇతర ప్రక్రియలను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేక అధికారి, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థకు సంబంధించి టెండర్ల ఆహ్వానానికి అవసరమైన చర్యలు చేపడుతున్నామని తెలిపారు. టెండర్ ప్రక్రియకు సంబంధించిన పనులను వేగవంతం చేయనున్నట్లు సీడీఎంఏకు వివరించారు. ప్రాజెక్ట్ అమలుకు సంబంధించి ఏవైనా సమస్యలు లేదా ఇబ్బందులు తలెత్తితే వాటిని పరిష్కరించేందుకు తగిన చర్యలు చేపడతామని పేర్కొన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఎస్‌ఈ రాజ్‌కుమార్, ఈఈ రవికుమార్, సీపీఓ రవీంద్ర రాడేకర్‌తో పాటు ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ విభాగాలకు చెందిన ఇతర అధికారులు పాల్గొన్నారు.

# మా ఆస్తులపై సిట్టింగ్ జడ్జితో ఎంక్వైరీకి సిద్ధం..!

**వరంగల్, సెప్టెంబర్ 16 (జై భీమ్ న్యూస్)**

తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ..హెచ్‌ఎండీఏ, డీటీసీపీ లే అవుట్లు ఓ వారం రోజుల్లోపు వ్యవస్థ తెస్తం.. జిల్లా స్థాయిలో కమిటీ వేస్తం. జీవో 118 ఎల్‌బీ నగర్ దానిపై పరిశీలిస్తాం. ఆలోచిస్తం.. లీగల్‌గా పరిష్కరిస్తాం. విస్తృత స్థాయిలో సంప్రదింపులు జరుపుతం. ఫీజులు కట్టించుకుంటం.. గైడ్ లైన్స్ ఇస్తం.. హైపవర్ కమిటీ వేస్తం.. ఇవే చెప్పిండు. నీ ఇల్లు మాత్రం తీసుకున్నవ్.. నీ ఇల్లుకు ఏ హైపవర్ కమిటీ లేదు.. లీగల్‌గా ఆలోచించేది లేదు. కమిటీ వేసేది లేదు.. పరిష్కరించేది లేదు. ఇవన్నీ రేవంత్ రెడ్డి చెప్పినవేనన్నారు.ఇయ్యాళ్ల కేటీఆర్ మీద.. నా మీద, మా నాయకుల మీద ఇన్ని ఆరోపణలు చేశావు కదా..బీఆర్ఎస్ హయాంలో ధరణి విషయంలో కావొచ్చు. లేదు కాంగ్రెస్ వచ్చిన డిసెంబర్ 7 2023 నుంచి ఈ రోజు వరకు భూభారతి వరకు నీ హయాంలో ఏం అవకతవకలు జరిగినయో.. మా హయాంలో ఏం జరిగినయో మొత్తం మేం విచారణకు సిద్ధం. సుప్రీంకోర్టు జడ్జితో చేయిద్దామా..? హైకోర్టు సిట్టింగ్ జడ్జితో చేయిద్దామా... నువ్వు ముందుకు రా..నీ కింద పనిచేసే అధికారులు కాదు.. నీది లేదు.. నాది లేదు.. సుప్రీం కోర్టు సిటింగ్ జడ్జితో చేయిద్దాం. బీఆర్ఎస్ హయాంలో జరిగింది కానీ..

ఈ మూడేళ్ల రేవంత్ రెడ్డి పాలనలో జరిగిన అవకతవకల మీద, ధరణిలో, భూభారతిలో రేవంత్ రెడ్డి హయా ంలో జరిగిన వాటి మీద మీ ఆస్తుల గురించి మా ఆస్తుల గురించి కూడా మాట్లాడు దామన్నారు. మా ఆస్తులు, రేవంత్ రెడ్డి ఆస్తులు నీ తమ్ముళ్ల ఆస్తులు ఎట్ల పెరిగినయ్.. అన్నింటి మీద సిట్టింగ్ జడ్జితో మేం ఎంక్వైరీకి సిద్ధం.. నువ్వు రెడీనా..? అని సవాల్ విసిరారు. రేవంత్ రెడ్డి కుటుంబానికి 308 ఎకరాల భూమి ఉందని గంటన్నరలో మాకు సమాచారం వచ్చింది. రేవంత్ రెడ్డి భూమి పక్కనే ఓఆర్‌ఆర్ అలైన్‌మెంట్, బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టులు కూడా వచ్చాయని తెలి సింది. ఫ్యూచర్ సిటీ చుట్టూ, మిగతా చోట్ల ఉన్న భూముల వివరాలు అన్నీ సేకరిస్తు న్నామని హరీశ్ రావు తెలిపారు.



## ఇనుప విద్యుత్ స్తంభాల మార్పిడి

**గ్రామాభివృద్ధిలో భాగంగా పాత ఐరన్ పోల్స్ తొలగింపు.. కొత్త విద్యుత్ స్తంభాల ఏర్పాటు**

**కమలాపూర్, సెప్టెంబర్ 16 (జై భీమ్ న్యూస్)**

గ్రామాభివృద్ధిలో భాగంగా అంబాల గ్రామంలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో పాత ఇనుప విద్యుత్ స్తంభాలను మార్చే పనులు కొనసాగుతున్నాయి. గ్రామంలోని వివిధ ప్రాంతాల్లో చాలాకాలంగా వినియోగంలో ఉన్న ఇనుప విద్యుత్ స్తంభాలను పరిశీలించి, బలహీనంగా ఉన్న వాటిని తొలగించి వాటి స్థానంలో కొత్త విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేస్తున్నారు. ప్రజలకు సురక్షితమైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడంతో పాటు విద్యుత్ వ్యవస్థను మరింత పటిష్టం చేయడమే లక్ష్యంగా ఈ పనులు చేపట్టినట్లు విద్యుత్ శాఖ సిబ్బంది తెలిపారు. ఏడీ వంశీకృష్ణ, ఏఈ రాములు ఆదేశాల మేరకు సబ్ ఇంజినీర్ సతీష్ పర్యవేక్షణలో లైన్‌మెన్ శ్రీనివాస్, హెల్పర్ రాజులతో పాటు కాంట్రాక్టు సిబ్బంది సమన్వయంతో పనులు నిర్వహిస్తున్నారు. ముందుగా పాత ఇనుప స్తంభాలను గుర్తించి, వాటి పరిస్థితిని పరిశీలించిన అనంతరం అవసరమైన ప్రాంతాల్లో మార్పిడి పనులు చేపడుతున్నారు. స్తంభాల తొలగింపు, కొత్త స్తంభాల ఏర్పాటు, విద్యుత్ లైన్లను తిరిగి అమర్చడం వంటి పనులను సిబ్బంది జాగ్రత్తగా నిర్వహిస్తున్నారు. ఇనుప స్తంభాలు కాలక్రమేణా తుప్పుపట్టి బలహీనపడే అవకాశం ఉండటంతో వాటి స్థానంలో కొత్త స్తంభాలను ఏర్పాటు చేయడం ద్వారా విద్యుత్ లైన్లకు మరింత భద్రత కల్పించవచ్చని అధికారులు పేర్కొన్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో బలహీనంగా ఉన్న విద్యుత్ స్తంభాల వల్ల ఏర్పడే ప్రమాదాలను నివారించేందుకు



ఇటువంటి మార్పిడి పనులు ఎంతో కీలకమని తెలిపారు. గ్రామంలోని విద్యుత్ మౌలిక వసతులను మెరుగుపరిచే చర్యల్లో భాగంగా చేపడుతున్న ఈ పనులతో విద్యుత్ సరఫరా వ్యవస్థ మరింత బలోపేతం కానుంది. విద్యుత్ స్తంభాల మార్పిడి సమయంలో ప్రజలు, వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని, విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించాలని అధికారులు సూచించారు. గ్రామాభివృద్ధికి సంబంధించిన మౌలిక వసతుల మెరుగుదలలో భాగంగా విద్యుత్ శాఖ చేపడుతున్న ఈ కార్యక్రమం పట్ల అంబాల గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పాత ఇనుప స్తంభాలను పూర్తిస్థాయిలో మార్చి, గ్రామంలోని అన్ని ప్రాంతాల్లో విద్యుత్ వ్యవస్థను మరింత సురక్షితంగా, పటిష్టంగా తీర్చిదిద్దాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## డీలిమిటేషన్ బిల్లుకు..బీఆర్ఎస్‌కు అభ్యంతరం లేదు



**ఢిల్లీ, సెప్టెంబర్ 16 (జై భీమ్ న్యూస్)**

2028 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీతో బీఆర్ఎస్ పొత్తు పెట్టుకోబోదని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. ఓపీ జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీలో 'ఇన్నోవేషన్ ఇన్ గవర్నెన్స్ ది స్టోరీ ఆఫ్ ఎ స్టార్టప్ స్టేట్' అంశంపై ప్రత్యేక ఉపన్యాసం ఇచ్చిన ఆయన.. అనంతరం విద్యార్థులతో ముఖాముఖిలో రాజకీయాలు, పాలన, డీలిమిటేషన్, కృత్రిమ మేధస్సు, సాంకేతికత తదితర అంశాలపై మాట్లాడారు.లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన అంశంపై కేటీఆర్ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా లోక్‌సభ స్థానాల సంఖ్యను దామాషా ప్రాతిపదికన పెంచితే డీలిమిటేషన్ బిల్లుకు మద్దతు ఇవ్వడంలో బీఆర్ఎస్‌కు అభ్యంతరం లేదన్నారు. దక్షిణాది రాష్ట్రాలకు ప్రస్తుతం లోక్‌సభలో 24 శాతం ప్రాతినిధ్యం ఉందని, మొత్తం స్థానాలను దామాషా ప్రకారం పెంచితే బిల్లుకు మద్దతు ఇస్తామని పేర్కొన్నారు. కృత్రిమ మేధస్సు, సాంకేతిక మార్పులపై విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు కేటీఆర్ సమాధానమిచ్చారు. కొత్త సాంకేతికతను స్వీకరించి ముందుకు సాగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.తన ప్రసంగంలో నిర్దిష్టత అవకాశాలు (అనే రెండు కాన్సెప్ట్‌ల ద్వారా తెలంగాణ అభివృద్ధి నమూనాను కేటీఆర్ వివరించారు. మౌలిక వసతులు, విశ్వసనీయమైన ప్రజా సేవల ద్వారా ప్రజలకు స్థిరమైన వాతావరణాన్ని కల్పించడంతో పాటు.. ఇన్నోవేషన్, వ్యవస్థాపకత, కొత్త అవకాశాలను ప్రోత్సహించే ఎకోసిస్టమ్‌ను నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు.సాగునీరు, వ్యవసాయం, తాగునీరు, విద్యుత్ రంగాల్లో తెలంగాణ చేపట్టిన కార్యక్రమాలను ఆయన ప్రస్తావించారు. కాళేశ్వరం ప్రాజెక్టును కరువు ప్రభావిత ప్రాంతాలకు గోదావరి జలాలను తరలించేందుకు చేపట్టిన ఇంజినీరింగ్ పరిష్కారంగా అభివర్ణించారు. 2014--15లో సుమారు 44.4 లక్షల టన్నులుగా ఉన్న తెలంగాణ వరి ఉత్పత్తి 2023--24లో 168.8 లక్షల టన్నులకు పెరిగిందని తెలిపారు.తెలంగాణ ఇన్నోవేషన్ ఎకోసిస్టమ్ గురించి వివరిస్తూ టీ-హబ్, వీ-హబ్, టీ-వర్క్స్, టాస్క్ వంటి సంస్థల పాత్రను కేటీఆర్ వివరించారు. వ్యవస్థాపకత, మహిళలకు అవకాశాలు, ప్రోటోటైపింగ్, హార్డ్‌వేర్ ఇన్నోవేషన్, యువతను పరిశ్రమలతో అనుసంధానం చేయడంలో వీటి పాత్రను ప్రస్తావించారు. తెలంగాణ ప్రభుత్వ స్టార్టప్ ఎకోసిస్టమ్‌లో వంటి సంస్థలు భాగంగా ఉన్నాయని రాష్ట్ర స్టార్టప్ పోర్టల్ కూడా పేర్కొంటోంది. పరిమితులను సమస్యలుగా కాకుండా నేర్చుకోవడం, మెరుగుపరచడం, అమలు చేయడంపై దృష్టి పెట్టాలని విద్యార్థులకు కేటీఆర్ సూచించారు.

## భారత సినీ రంగానికి అనంత్ నాగ్ సేవలు స్ఫూర్తిదాయకం

**అమరావతి, సెప్టెంబర్ 16, (జై భీమ్ న్యూస్)**

ప్రముఖ కన్నడ నటుడు, బహుముఖ ప్రజ్ఞాశాలి, పద్మభూషణ్ అనంత్ నాగ్‌కు కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక దాదాసాహెబ్ ఫాల్కే అవార్డును ప్రకటించిన నేపథ్యంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఐదు దశాబ్దాలుగా భారతీయ సినిమాకు అనంత్ నాగ్ చేసిన అసాధారణమైన సేవ నిజంగా అద్భుతమైనదని పవన్ కొనియాడారు. ఆయన ప్రతిభ, అంకితభావం తరతరాలకు స్ఫూర్తినిచ్చాయన్నారు. సినిమా రంగానికి ఆయన చేసిన అమూల్యమైన సేవకు దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు ప్రకటించడం ద్వారా భారత ప్రభుత్వం తగిన గుర్తింపునిచ్చిందన్నారు. అనంత్ నాగ్ మంచి ఆరోగ్యం, సుఖసంతోషాలతో నిండునూరేళ్లు



జీవించాలని.. మరెన్నో చిరస్మరణీయమైన ప్రదర్శనలు ఇవ్వాలని ఆకాంక్షిస్తున్నట్లు పవన్ కోరుకున్నారు.




## విద్యార్థుల సమస్యలపై ఎంఈవోను నిలదీసిన సర్పంచులు

**మాగనూరు , సెప్టెంబర్ 16 (జై భీమ్ న్యూస్)**

మండలంలోని ప్రజా సమస్యలను చర్చించి పరిష్కార మార్గాలు చూపాల్సిన మాగనూరు మండల సర్వసభ్య సమావేశం నామమాత్రంగా సాగిందని ప్రజాప్రతినిధులు అసంతృప్తి వ్యక్తం చేశారు. మూడు నెలలకు ఒకసారి నిర్వహించే సమావేశానికి కీలక శాఖల అధికారులు గైర్హాజరు కావడంతో ప్రజా సమస్యల పై సమగ్రంగా చర్చించే పరిస్థితి లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మరుగుదొడ్లు, మూత్రశాలలు లేకపోవడం, ఉన్న సౌకర్యాలు కూడా సక్రమంగా లేకపోవడంపై ఎంఈవో( వీజూం)ను నిలదీశారు. విద్యార్థులు అధికంగా ఉన్న పాఠశాలల్లో అవసర మైన అదనపు బోధనా సిబ్బంది, విద్యా వాలంటీర్లను ఏర్పాటు చేయాలని ఎన్నిసార్లు కోరినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు.విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్న తరగతుల్లో బోధనా సిబ్బంది కొరత ఉంటే విద్యార్థుల చదువుపై ప్రభావం పడుతుందని పేర్కొన్నారు. మండలంలో తరచూ విద్యుత్ కోతలు విధించడంతో రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. విద్యుత్ సరఫరా సక్రమంగా లేక పంటలకు సాగునీరు అందక పంటలు ఎండిపోయి రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

## వికాసం కంటే విధ్వంసానికే కాంగ్రెస్ ప్రాధాన్యం



**ఖమ్మం, సెప్టెంబర్ 16, జై భీమ్ న్యూస్ :**

కాంగ్రెస్ ప్రభుత్వానికి విధ్వంసం, కూల్చివేతలు తప్ప మరో ఎజెండా కనిపించడం లేదని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ విమర్శించారు. ఖమ్మం పట్టణం శ్రీనివాస్ నగర్ ప్రాంతంలో ఇళ్ల కూల్చివేతకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేస్తున్న బాధితులకు ఆయన మద్దతు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదల కోసం కొత్తగా నిర్మించిన ఇళ్ల కంటే, వివిధ కారణాలతో కూల్చివేసిన ఇళ్లే ఎక్కువగా ఉన్నాయని ఆరోపించారు. వికాసం చేతకాని ప్రభుత్వం విధ్వంసానికి పాల్పడుతోందని మండిపడ్డారు. పేదల ఇళ్లను కూల్చివేసి వారి జీవనోపాధిపై ప్రభావం చూపడం సరి కాదని, పేదల పొట్ట కొట్టే చర్యలను ప్రభుత్వం నిలిపివేయాలని డిమాండ్ చేశారు.ఇళ్ల కూల్చివేత ఆలోచనను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విరమించుకోవాలని కోరారు. తాను మంత్రిగా ఉన్న సమయంలో ఖమ్మం నగరంలో అనేక మంది పేదలకు ఇళ్ల పట్టాలు అందించడంతో పాటు, పేదలకు గృహ వసతి కల్పించేందుకు చర్యలు చేపట్టామని గుర్తు చేశారు. పేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వడం తమ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధికి నిదర్శనమైతే, ఇప్పుడు పేదల ఇళ్లు కూల్చివేయడం కాంగ్రెస్ ప్రభుత్వానికి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు ఘనతగా మారిందని విమర్శించారు.

# అనాథ చిన్నారుల మధ్య ఆత్మీయంగా
# కోటింరెడ్డి వినయ్ రెడ్డి జన్మదిన వేడుకలు






- చిన్నారులకు స్వయంగా భోజనం వడ్డించిన టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్
- కుటుంబ సభ్యులు, రాజకీయ ప్రముఖులు, ఎస్.ఎస్. రాజు బృందం పాల్గొనడంతో సందడిగా వేడుకలు

**హైదరాబాద్(జై భీమ్ న్యూస్)**

టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ కోటింరెడ్డి వినయ్ రెడ్డి జన్మదిన వేడుకలు అనాథ చిన్నారుల మధ్య ఆత్మీయంగా, ఘనంగా జరిగాయి. సాధారణంగా కుటుంబ సభ్యులు, స్నేహితులు, అభిమానుల మధ్య జన్మదిన వేడుకలు నిర్వహించుకునే సంప్రదాయానికి భిన్నంగా, తన ప్రత్యేక రోజును అనాథ చిన్నారులతో కలిసి జరుపుకోవడం ఈ వేడుకకు ప్రత్యేకతను తీసుకొచ్చింది. అమ్మ ఒడి వాలంటీర్ ఆర్గనైజేషన్ అనాథాశ్రమానికి చెందిన చిన్నారులు ఈ వేడుకల్లో పాల్గొని కోటింరెడ్డి వినయ్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. చిన్నారుల చిరునవ్వుల మధ్య జరిగిన ఈ వేడుక ఆత్మీయ వాతావరణాన్ని నెలకొల్పింది. ఈ సందర్భంగా కోటింరెడ్డి వినయ్ రెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి చిన్నారులతో మమేకమయ్యారు. వారికి స్వయంగా తన చేతులతో భోజనం వడ్డించి, కొంతసేపు వారితో ఆప్యాయంగా గడిపారు. చిన్నారులతో కలిసి ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అనాథ చిన్నారుల మధ్య తన జన్మదినాన్ని జరుపుకోవడం ఎంతో ఆనందంగా, సంతృప్తిగా ఉందన్నారు. చిన్నారుల ముఖాల్లో కనిపించిన చిరునవ్వు తనకు లభించిన గొప్ప జన్మదిన కానుక అని పేర్కొన్నారు. ప్రేమ, ఆదరణ అవసరమైన చిన్నారులకు సమాజంలోని ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని ఆకాంక్షించారు. "పుట్టినరోజు అంటే మనకు శుభాకాంక్షలు అందుకునే రోజు మాత్రమే కాదు… మరొకరి జీవితంలో చిన్న ఆనందాన్ని నింపగలిగే రోజు కూడా" అనే సందేశాన్ని ఈ వేడుక చాటిచెప్పింది. కార్యక్రమంలో కోటింరెడ్డి వినయ్ రెడ్డి కుటుంబ సభ్యులతో పాటు పలువురు రాజకీయ ప్రముఖులు, నాయకులు, శ్రేయోభిలాషులు, ఎస్.ఎస్. రాజు,ఆయన బృందం, రమేష్, రాజేష్, అమ్మ ఒడి అనాథాశ్రమం వ్యవస్థాపకులు మోహన్ తదితరులు పాల్గొని జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆడంబరాలకు దూరంగా అనాథ చిన్నారుల మధ్య ప్రేమ, ఆప్యాయతలను పంచుకుంటూ నిర్వహించిన ఈ జన్మదిన వేడుక సామాజిక బాధ్యత, మానవత్వానికి ప్రతీకగా నిలిచింది.




## 'సర్దార్ 2' మూవీ రివ్యూ..

**సినిమా పేరు : సర్దార్ 2**

తారాగణం: కార్తీ, ఎస్.జె.సూర్య, అషికా రంగనాథ్, మాళవిక మోహనన్..
దర్శకత్వం: పీఎస్ మిత్రన్
నిర్మాతలు :ఎస్.లక్ష్మణ్‌కుమార్, ఇషాన్ సక్సేనా..కార్తీ మూవీస్

కార్తీ నటించిన 'సర్దార్' సినిమా తమిళంతో పాటు తెలుగులోనే పెద్ద హిట్. ఆ సినిమాకు సీక్వెల్ అనగానే సినిమాపై సాధారణంగానే అంచనాలు ఏర్పడ్డాయి. అనుకున్నట్టే ప్రచార చిత్రాలు కూడా ఈ సినిమాపై ఆసక్తిని పెంచాయి. మరి 'సర్దార్' స్థాయిలో ఈ 'సర్దార్ 2' ఆకట్టుకున్నదా? కార్తీకి ఖాతాలో హిట్ పడ్డట్టేనా? అనే ప్రశ్నలకు సమాధానాలు తెలుసుకోవాలంటే ముందు కథలోకి వెళ్లాలి.

**కథ**

ప్రపంచాన్నే ప్రమాదంలోకి నెట్టగలిగే ఓ వైరల్ వెపన్‌నీ, దాని విరుగుడునీ జపాన్ కనుగొంటుంది. దాని ద్వారా ప్రపంచాన్నే శాశించాలనేది జపాన్ కుట్ర. ఆ కుట్రను భగ్నం చేసే బాధ్యతను ఇండియన్ గవర్నమెంట్ ఓ 'రా' టీమ్‌కి అప్పజెబుతుంది. ఆ టీమ్‌లోని రా ఏజెంట్లలో సర్దార్(కార్తీ) ఒకడు. జపాన్ నుంచి ఆ వైరల్ వెపన్‌ని ఇండియాకు తరలించే ప్రయత్నం చేస్తుంటుంది జపాన్. ఆ వైరల్ వెపన్‌ని ఇండియా దాకా రానివ్వకుండా మధ్యలోనే హిందూ మహాసముద్రంలో పడేయాలనేది 'రా ఏజెంట్ల' ప్రయత్నం. ఈ ప్రయత్నంలో భాగంగా సర్దార్ చేసే చిన్న తప్పు వల్ల ఆ వైరల్ వెపన్‌లోని కొంతభాగం ఇండియాలోని ఓ ప్రాంతాన్ని నాశనం చేస్తుంది. దాంతో సర్దార్ దేశం దృష్టిలో ఓ ద్రోహిలా మిగిలిపోతాడు. మిగిలిన భాగాన్ని 'రా ఏజెంట్స్' ఓ ప్రాంతంలో భద్ర పరుస్తారు. 35ఏండ్ల తర్వాత ఇండియాలో ఎవరికీ తెలియని ఓ ప్రాంతంలో నిక్షిప్తమై ఉన్న ఆ 'వైరల్ వెపన్' కోసం బ్లాక్ డగ్గర్(ఎస్.జె.సూర్య) అనే అండర్‌వరల్డ్ డాన్ ప్రయత్నాలు చేయడం మొలుపెడతాడు. అసలు ఈ బ్లాక్ డగ్గర్ ఎవరు? ఆ వైరల్ వెపన్‌ని నిర్వీర్యం చేసే క్రమంలో సర్దార్ చేసిన తప్పేంటి? ఆ వైరల్ వెపన్‌ని బ్లాక్ డగ్గర్ చేతికి చిక్కకుండా సర్దార్ ఎలా కాపాడాడు? అనేదే ఈ సినిమా కథమూవీ రివ్యూలు

**విశ్లేషణ**

ఇలాంటి కథలు గతంలో చాలానే వచ్చాయి. ఎన్టీఆర్ 'చిక్కడు దొరకడు' సినిమాలో మూడు హారాల ఫార్ములాను ఇందులో మూడు కత్తుల ఫార్ములాలా వాడేశాడు దర్శకుడు మిత్రన్. ఆ మూడు కత్తులతో మాత్రమే ఆ వెపన్‌ని దాచి ఉన్న యంత్రాన్ని ఓపెన్ చేయవచ్చు. ఆ మూడు కత్తులు మూడు ప్రాంతాల్లో ఉంటాయి. దాన్ని దక్కించుకునే క్రమంలో హీరోలు, విలన్ల ఎత్తులు పైఎత్తులే ఈ సినిమా కథనం. సినిమా ఆద్యంతం యాక్షన్ మోడ్‌లో సాగింది. ఎమోషన్స్ కరువయ్యాయి. 'సర్దార్'లో ఉన్న ఎమోషన్ 'సర్దార్ 2' కనిపించదు. అయితే.. 'సర్దార్' కంటే భారీగా సినిమాను తీశారు. సినిమా అంతా సీరియస్ మోడ్‌లో కన్ఫ్యూజన్‌గా సాగుతుంది. సగటు ప్రేక్షకుడికి అర్థం కావడం కష్టమే. అయితే.. ఈ కథలో అంతర్లీనంగా మంచి సందేశం ఉంది. జనం వాడుతున్న మెడిసన్స్, తింటున్న చికెన్, కూరగాయలు.. నిత్యవసర వస్తువుల్లో యాంటీబయాటిక్స్ ఎలా కలుస్తున్నాయో, ప్రజల ఆరోగ్యం ఎలా దిగజారుతున్నదో ఓ సన్నివేశం ద్వారా బాగా విశర పరిచాడు దర్శకుడు మిత్రన్. సినిమాలో ఉన్న యాక్షన్, తండ్రీ కొడుకులుగా కార్తీ అభినయం ఆడియన్స్‌కి నచ్చొచ్చు. అయితే.. ప్రతి పాత్రకూ ఈ కథలో ప్రాధాన్యత ఉండటం నిజంగా అభినందించదగ్గ విషయం. చివరకు యోగిబాబు పాత్ర కూడా కథలో భాగమే. హీరోయిన్లని కేవలం గ్లామర్‌కే వాడకుండా సంఘర్షణాత్మకంగా వారి పాత్రలను నడిపించారు మిత్రన్. ప్రథమార్థం మీద ద్వితీయార్థం సినిమా బావుంది.

**నటీనటులు**

తండ్రీకొడుకులుగా కార్తీ చక్కగా నటించాడు. రెండు పాత్రల్లో చక్కటి వ్యత్యాసాన్ని చూపించాడు. యాక్షన్ సన్నివేశాల్లో అయితే బాగా కష్టపడ్డాడు. ఇక హీరోయిన్లు అషికా రంగనాథ్, మళవిక మోహనన్‌లది అభినయానికి ఆస్కారమున్న పాత్రలు. కార్తీ చెప్పినట్టుగా ఇందులో హీరోయిన్లు డ్యాన్సులు చేయరు. యుద్ధాలు చేస్తారు. ఇద్దరూ చాలా కష్టపడ్డారు. ఈ సినిమాలో హైలైట్ ఎస్.జె.సూర్య. తన విలనీతో అదరగొట్టాడు. ఓ వైపు విలనీ పండిస్తూ, సమాజానికి అద్భుతమైన సందేశం కూడా ఇచ్చాడు. ద్వితీయార్థంలో వచ్చే ఆ సన్నివేశం సినిమాకే హైలైట్. ఇక మిగతా నటీనటులంతా పరిధిమేర తమ పాత్రలను రక్తి కట్టించారు. వీశీజఱవం

**సాంకేతికంగా..**

కథ, కథనం విషయంలో కాస్త జాగ్రత్త పడితే బావుండేదో అనిపించింది. 'రా' ఇన్విస్టిగేషన్‌కి చెందిన కొన్ని శాస్త్రీయ నామాలు సామాన్య ప్రజలకు అర్థం కావు. వాటిని అర్థమయ్యేలా దర్శకుడు జాగ్రత్త పడితే బావుండేది. కెమెరా, నేపథ్య సంగీతం బావుంది. ఎడిటింగ్ విషయంలో ఇంకాస్త పని ఉందేమో అనిపిస్తుంది. మొత్తంగా యాక్షన్ సినిమాలను ఇష్టపడే వారికి 'సర్దార్ 2' నచ్చొచ్చు.

**బలాలు**

కార్తీ, ఎస్.జె.సూర్య నటన, కొన్ని సన్నివేశాలు...

**బలహీనతలు**

కన్ఫ్యూజన్‌తో సాగే కథనం, సినిమా కాస్త స్లోగా సాగడం..

**రేటింగ్ : 2.5/5**

## అల్లరి నరేష్ కొత్త సినిమా ఎలా ఉందంటే!

**జై భీమ్ న్యూస్, సినిమా :**

అల్లరి నరేశ్ మళ్లీ కామెడీ జానర్లో చేసిన ప్రయత్నం 'రంభ ఊర్వశి మేనక'. ఆ మధ్య సీరియస్ కథలతో ముందుకెళ్లిన అల్లరి నరేశ్ తన పాత జానర్‌లోకి వచ్చి ఈ సినిమా చేయడంతో ఈ సినిమాపై ఆడియన్స్‌లో అంచనాలు ఏర్పడ్డాయి. పైగా హాస్య మూవీస్ వంటి సంస్థ నిర్మించిన సినిమా కావడం. దానికితోడు ప్రతిష్టాత్మక అన్నపూర్ణ స్టూడియోస్ సంస్థ ఈ చిత్రాన్ని విడుదల చేయడంతో 'రంభ ఊర్వశి మేనక' చిత్రంపై ఆడియన్స్‌లో ఆసక్తి ఏర్పడింది. మరి ఈ ఫాంటసీ కామెడీ ఎంటర్టైనర్ అందరి అంచనాలనూ అందుకున్నదా? అల్లరి నరేశ్ మళ్లీ కామెడీతో విజయం సాధించాడా? అనేది తెలుసుకోవాలంటే ముందు కథలోకి వెళ్లాలి..

**కథ**

మంతెన సూర్యనారాయణ అలియాస్ సూరి(అల్లరి నరేశ్), అతని కుటుంబం 'రంభ ఊర్వశి మేనక' పేరుతో ఓ డ్రామా కంపెనీ నడుపుతూ జీవనాన్ని సాగిస్తుంటారు. వారి దగ్గర ఓ మ్యాజిక్ బుక్ ఉంటుంది. ఆ బుక్‌పై సరిగ్గా ముగ్గు గీస్తే స్వర్గం నుంచి రంభ ఊర్వశి మేనక దిగొచ్చి కోర్కెలు తీరుస్తారని ఓ నమ్మకం. ఆ బుక్ వల్ల సూరి కుటుంబం అప్పుల ఊబిలో చిక్కుకుపోతుంది. సినిమా హీరో కావాలనేది సూరి కల. కానీ అందుకు తగ్గ ప్రయత్నాలేవీ చేయడు. ఆ బుక్ పేరు చెప్పి అప్పులు చేస్తుంటాడు. చివరకు ఈ బుక్ కారణంగా ఆ కుటుంబానికి పుట్టెడు అప్పులే మిగులుతాయి. ఈ బాధలోనే అతని తల్లి మంచం పడుతుంది. ఆమెను బతికించుకోవాలంటే లక్షలతో పని. దాంతో సూరి ఏం చేయాలో అర్థంకాక ఉక్కిరిబిక్కిరి అవుతాడు. ఆ దిక్కుతోచని స్థితిలోనే ఆ మ్యాజిక్ బుక్‌ని తీసి, దానిపై ముగ్గు గీస్తాడు. అంతే.. బుక్ ఓపెన్ అవుతుంది. నిజంగా స్వర్గం నుంచి రంభ ఊర్వశి మేనక దిగొస్తారు. మరి ఆ దేవతామూర్తులు సూరి కోర్కెలన్నీ తీర్చారా? హీరో కావాలనే సూరి కోర్కె నెరవేరిందా? లేక కొత్త కష్టాలు వచ్చాయా? ఈ ప్రశ్నలకు సమాధానమే మిగతా కథ

**విశ్లేషణ**

రొటీన్ రొడ్డకొట్టుడు కామెడీ సినిమా ఇది. గతంలో ఇలాంటి ఫాంటసీ సినిమాలు చాలా వచ్చాయి. సినిమా ఆద్యంతం స్పూఫ్‌లు, ఇటీవల తెలుగు రాష్ట్రాల్లో ట్రెండ్ అయిన అంశాలు.. వీటన్నింటినీ రంగరించి దర్శకుడు సీన్స్ రాసుకున్నాడు. కథ, కథనం, కామెడీ.. ఇవన్నీ పాత పద్ధతిలోనే ఉంటాయి తప్ప ఏక్కడా కొత్తదనం అనేదే ఈ సినిమాలో కనిపించదు. సిట్యువేషన్ కామెడీ అనేది ప్రేక్షకులపై బలమైన ప్రభావం చూపిస్తుంది కానీ, డైలాగ్ కామెడీ, క్రింజ్ కామెడీ ఆడియన్స్‌కి అంతగా అలరించదు. దర్శకుడు ఈ సినిమా విషయంలో డైలాగ్ కామెడీనే ఎక్కువ ఉపయోగించాడు. హాలీవుడ్ ఒడిస్సీ సినిమా. ఏపీ భోగాపురం ఎయిర్‌పోర్ట్, ఓజీ సినిమా, ఏపీ రాజధాని అమరావతి.. ఇలా ట్రెండ్‌లో ఉన్న ప్రతి అంశం డైలాగులుగా ఈ సినిమాలో వినిపిస్తుంటాయి. అయితే.. అల్లరి నరేశ్, వీకే నరేశ్, వెన్నెల కిశోర్, శ్రీనివాసరెడ్డి.. ఇలా రాటుదేలిన నటులు ఉండటం వల్ల సినిమా కాస్త నిలబడిందని చెప్పాలి. వారి వల్ల సినిమాలో అక్కడక్కడా నవ్వులు పండాయి. ప్రథమార్థంతో పోలిస్తే ద్వితీయార్థం సినిమా ఫర్లేదనిపించింది. రంభ ఊర్వశి మేనకలతో అల్లరి నరేశ్ సీన్స్ ఆడియన్స్‌ని అలరిస్తాయి. పతాక సన్ని వేశం బావుంది.

**నటీనటులు**

అల్లరి నరేశ్ ఎప్పటిలాగే కామెడీని చక్కగా పండిచారు. ఇక వీకే నరేశ్ గురించి చెప్పేదేముంది.

## సూరి, సుహాస్‌ల యాక్షన్ డ్రామా ఎలా ఉంది?




**జై భీమ్ న్యూస్, సినిమా :**

టాలెంటెడ్ నటుడు సూరి, తెలుగు యువ నటుడు సుహాస్ ప్రధాన పాత్రల్లో నటించిన స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా 'మండాడి'. మాథిమారన్ పుగలేంది దర్శకత్వంలో సముద్రం, పడవల రేసింగ్ నేపథ్యంలో తెరకెక్కిన ఈ చిత్రానికి ఎల్‌రెడ్ కుమార్ నిర్మాతగా వ్యవహరించగా, జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందించారు. మహిమ నంబియార్ కథనాయికగా నటించగా, సత్యరాజ్, మిథున్, రవీంద్ర విజయ్ తదితరులు కీలక పాత్రల్లో నటించారు. ఈ చిత్రం నేడు ప్రేక్షకుల ముందుకు రాగా ఈ సినిమా ఎలా ఉందో రివ్యూలో చూద్దాం.

**కథ**

సముద్రంలో చేపల వేటలోనూ, పడవ పందాల్లోనూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న జాలరి ముత్తుకాళి (సూరి). కొన్ని వ్యక్తిగత కారణాల వల్ల తన గ్రామానికి, ప్రజలకు దూరంగా ఉంటూ వస్తాడు. అయితే స్థానిక మత్స్యకారులు ఎదుర్కొంటున్న పెద్ద సమస్యను పరిష్కరించడానికి కాళి మళ్ళీ రంగంలోకి దిగుతాడు. ఈ క్రమంలో అతని చిరకాల ప్రత్యర్థి అయిన సట్టై పులి (సుహాస్)తో కాళికి మళ్ళీ పోరు మొదలవుతుంది. వీరిద్దరి మధ్య పడవ పందాలు ఎంతటి ఉత్కంఠకు దారితీశాయి? అసలు కాళి తన వాళ్లను ఎందుకు విడిచిపెట్టాల్సి వచ్చింది? ఈ పోరులో చివరికి విజయం ఎవరిని వరించింది? అనేదే ఈ చిత్ర అసలు కథ.

**విశ్లేషణ**

సముద్రం నేపథ్యంలో సాగే పడవ పందాలు, స్నేహం, పగ, ప్రతీకారాల సమ్మిళితంగా ఈ సినిమా తెరకెక్కింది. ఇలాంటి ఒక ప్రత్యేకమైన స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా బ్యాక్‌డ్రాప్ తెలుగు తెరపై కొత్త అనుభూతిని ఇస్తుంది. సినిమా ప్రారంభ సన్నివేశాలు, ఒక పాత్రపై జరిగే దాడి చుట్టూ తిరిగే సీన్స్ మంచి సస్పెన్స్‌ను క్రియేట్ చేస్తాయి. కథ కళింగపట్నానికి షిఫ్ట్ అయ్యాక ప్రథమార్థంలో కథనం కాస్త నెమ్మదిగా సాగుతుంది. కొన్ని సన్నివేశాలు సాగదీతగా అనిపించడం వల్ల ఇంటర్వెల్ వరకు ప్రేక్షకుడు కొంచెం సహనం వహించాల్సి వస్తుంది. కానీ, ద్వితీయార్థం సినిమాను పూర్తిగా నిలబెట్టింది. కాళి గతం, పులితో ఉన్న స్నేహ బంధం, కోచ్‌గా సత్యరాజ్ ఎంట్రీ వంటి అంశాలు డ్రామాను రక్తికట్టించాయి. ముఖ్యంగా క్లైమాక్స్‌లో వచ్చే పడవ పోటీలు సీటు అంచున కూర్చునేలా చేస్తూ అత్యంత ఉత్కంఠభరితంగా సాగుతాయి.

**నటీనటులు**

సూరి ముత్తుకాళి పాత్రలో ఒదిగిపోయారు. ఎలాంటి హంగులు లేకుండా, కేవలం తన సహజమైన నటనతో పాత్రకు పూర్తి ప్రాణం పోశారు. రియలిస్టిక్ యాక్టింగ్‌తో మెప్పించారు. సుహాస్ సాట్టై పులి పాత్రలో సరికొత్త కోణంలో కనిపించారు. విలనిజంతో పాటు విభిన్న వేరియేషన్స్ చూపిస్తూ సినిమాకి ప్రధాన ఆకర్షణగా నిలిచారు. సత్యరాజ్ కోచ్ పాత్రలో తన అనుభవాన్ని పూర్తిగా రంగరించి జీవించారు. మహిమ నంబియార్‌తో పాటు మిగిలిన నటీనటులు తమ పరిధి మేరకు చక్కటి అభినయాన్ని ప్రదర్శించారు.

**సాంకేతికంగా**

జీవీ ప్రకాష్ కుమార్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ సినిమాకి పెద్ద ఎస్సెట్. ముఖ్యంగా పడవ పోటీల సమయంలో వచ్చే మ్యూజిక్ గూస్‌బంప్స్ తెప్పిస్తుంది. సినిమాటోగ్రఫీ ఎస్.ఆర్. కతిర్ కెమెరా పనితనం చాలా నేచురల్‌గా ఉంది. సముద్రపు అందాలను, పడవ పోటీలను తెరపై కళ్లకు కట్టినట్లు చూపించారు. దర్శకుడు మాథిమారన్ పుగలేంది ఎంచుకున్న పాయింట్ బాగుంది. ఫస్టాఫ్‌లో స్క్రీన్ ప్లే విషయంలో కొంత తడబడినప్పటికీ, సెకండాఫ్‌ను మరియు ఎమోషన్స్‌ను డీల్ చేసిన విధానం ప్రశంసనీయం.

**ప్లస్ పాయింట్లు**

సముద్రంలో సాగే పడవ పోటీల నేపథ్యం
ద్వితీయార్థంలో వచ్చే బలమైన భావోద్వేగాలు
సూరి, సుహాస్ నటన,
నేపథ్య సంగీతం, విజువల్స్వీశీజఱవం

**మైనస్ పాయింట్లు**

ప్రథమార్థంలో నెమ్మదైన కథనం
రొటీన్‌గా అనిపించే కొన్ని సంఘర్షణ సన్నివేశాలు చివరిగా ఫస్ట్ హాఫ్ కొంచెం నెమ్మదిగా ఉన్నప్పటికీ.. సెకండాఫ్‌లో వచ్చే పడవ పోటీలు, ఎమోషనల్ డ్రామా సినిమాను మంచి అనుభూతిని మిగిలేలా చేస్తాయి. సరికొత్త బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఈయాక్షన్ డ్రామాను వీకెండ్‌లో ఒకసారి హ్యాపీగా చూడవచ్చు.

**రేటింగ్: 2.75/5**

## విచిత్ర గుండె కథతో వచ్చిన సర్వైవల్ థ్రిల్లర్ ఎలా ఉందంటే?

**జై భీమ్ న్యూస్, సినిమా :**

ఎడమవైపు ఉండాల్సిన గుండె కుడివైపు ఉంటే శరీరంపై ఎలాంటి ప్రభావం పడుతుంది? ఆ అరుదైన పరిస్థితిని ఎదుర్కొన్న హీరో జీవితంలో ఎలాంటి అనూహ్య మలుపులు చోటుచేసుకున్నాయి? ఈ ఆసక్తికరమైన పాయింట్‌తో తెరకెక్కిన చిత్రమే 'కికు చిరంజీవి'. శుభ సాయి వెంకట్ దర్శకత్వంలో కికు యనమల, కశిష్ ఖాన్ జంటగా నటించిన ఈ చిత్రం నేడు ప్రేక్షకుల ముందుకు వచ్చింది. కికు ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై దీప్తి నడిమింటి నిర్మించారు. ఈశ్వరీ రావు, తనికెళ్ల భరణి, శ్రీకాంత్ భరత్ వైవా రాఘవ, గోపరాజు రమణ కీలక పాత్రల్లో నటించారు. మరి ఈ సినిమా ప్రేక్షకులను ఏ మేరకు మెప్పించిందో రివ్యూలో చూద్దాం. చిరంజీవి (కికు యనమల) అనాథ వృత్తిరీత్యా ఫోటోగ్రాఫర్. అతనికి పుట్టుకతోనే హార్ట్ ఎడమవైపు కాకుండా కుడివైపు ఉండే అరుదైన వైద్య సమస్య ఉంటుంది. మరోవైపు, అనాథ అయిన మను (కశిష్ ఖాన్)ను శ్రీకాంత్ అయ్యంగార్ దత్తత తీసుకుని పెంచుతాడు. ఆమె వివాహం, పిల్లల దత్తత చుట్టూ కథ నడుస్తుంది. మను వివాహం నిశ్చయమైన వ్యక్తి ప్రమాదవశాత్తు మరణించడం, ఆ తర్వాత ఆమె ఫ్రెండ్స్‌తో కలిసి ఫారెస్ట్ ట్రిప్‌కి వెళ్లడం జరుగుతుంది. ఆ టూర్‌ని కవర్ చేయడానికి వెళ్లిన చిరంజీవితో మనుకి పరిచయం ఏర్పడుతుంది. ఫారెస్ట్ నుంచి తిరిగి వచ్చే క్రమంలో అసలు కథ మొదలవుతుంది. ఈశ్వరీరావు ఎంట్రీ, హీరోహీరోయిన్ల పెళ్లి, ఆ తర్వాత ఫస్ట్ నైట్ రోజు జరిగే భారీ ట్విస్ట్ కథను పూర్తిగా మార్చేస్తుంది. అసలు ఒక్క రాత్రిలో ఎడమవైపు ఉండాల్సిన గుండె కుడివైపు ఎలా కొట్టుకుంది? ఆ వెనుక ఉన్న రహస్యం ఏంటి? తనికెళ్ల భరణి పాత్ర నేపథ్యం ఏమిటి? వంటి ప్రశ్నలకు సమాధానమే మిగతా సినిమా. ఇలాంటి డిఫరెంట్ మెడికల్ కాన్సెప్ట్‌తో సినిమాలు రావడం టాలీవుడ్‌కి కొత్తేమీ కాకపోయినా, దర్శకుడు శుభ సాయి వెంకట్ దీన్ని ఒక థ్రిల్లర్ జోనర్‌లో ప్రజెంట్ చేసే ప్రయత్నం చేయడం అభినందనీయం.

జై భీమ్ తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE
గురువారం 17- 09- 2026
www.jaibheemtv.com


# పెరుగుతున్న అండాశయ క్యాన్సర్ ముప్పు..

**జై భీమ్ న్యూస్, ఆరోగ్యం:**

మహిళల్లో కనిపించే క్యాన్సర్లలో అండాశయ క్యాన్సర్ ను కూడా అత్యంత తీవ్రమైనదిగా పరిగణిస్తారు. ప్రపంచవ్యాప్తంగా ఈ వ్యాధి కేసులు, మరణాలు గణనీయంగా ఉన్నాయి. గ్లోబోకాన్ 2020 గణాంకాల ప్రకారం సుమారు 3.14 లక్షల మంది మహిళలకు అండాశయ క్యాన్సర్ నిర్ధారణ కాగా, దాదాపు 2.07 లక్షల మంది ఈ వ్యాధితో మరణించారు. 2040 నాటికి అండాశయ క్యాన్సర్ కేసులు దాదాపు 40 శాతం పెరిగే అవకాశం ఉందని అంచనా. వ్యాధి నిర్ధారణ అయిన మహిళల్లో సుమారు 50 శాతం మంది దీనితో మరణించే ప్రమాదం ఉందని అంచనాలు చెబుతున్నాయి. అండాశయ క్యాన్సర్‌ను తరచూ సైలెంట్ కిల్లర్‌గా పేర్కొంటారు. దీనికి ప్రధాన కారణం ఈ వ్యాధి ప్రారంభ దశలో స్పష్టమైన లక్షణాలు కనిపించకపోవడం లేదా సాధారణ సమస్యలుగా భావించి నిర్లక్ష్యం చేయడం. దాదాపు 80 శాతం మంది మహిళల్లో అండాశయ క్యాన్సర్ ముదిరిన దశలోనే గుర్తిస్తున్నట్లు సమాచారం. క్యాన్సర్ దశ పెరిగే కొద్దీ చికిత్స ఫలితాలు, జీవించే అవకాశాలు తగ్గుతాయి. అందుకే ప్రారంభ దశలోనే గుర్తించడం చాలా కీలకం.మహిళల సంరక్షణ ప్రారంభించండి

2018లో నిర్వహించిన ఎవ్రీ ఉమెన్ స్టడీలో సుమారు 69 శాతం మంది మహిళలకు అండాశయ క్యాన్సర్, దాని ప్రమాద కారకాలు, ప్రధాన లక్షణాల గురించి సరైన అవగాహన లేదని తేలింది. మహిళల్లో అవగాహన లోపంతోపాటు ఆరోగ్య నిపుణుల్లో ఈ వ్యాధిపై తగిన అవగాహన లేకపోవడం, వ్యాధి నిర్ధారణకు అవసరమైన పరీక్షలను పూర్తి చేయడానికి ఆరోగ్య వ్యవస్థల్లో ఎక్కువ సమయం పట్టడం వంటి కారణాలు కూడా ఆలస్యంగా వ్యాధి గుర్తించడానికి దారితీస్తున్నాయి. దీంతో చాలా మంది మహిళలు వ్యాధి నిర్ధారణ కోసం ఎదురుచూస్తూనే ఆలస్యం అవుతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో మార్పులు తీసుకురాకపోతే 2040 నాటికి 40 లక్షలకు పైగా మహిళలు అండాశయ క్యాన్సర్‌తో మరణించే అవకాశం ఉందని అంచనా. అందువల్ల ఈ వ్యాధిపై ప్రపంచవ్యాప్తంగా అవగాహన పెంచడంతోపాటు నివారణ, ముందస్తు గుర్తింపుపై మరింత దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. గత పదేళ్లలో అండాశయ క్యాన్సర్ చికిత్స, పరిశోధన రంగాల్లో ఎన్నో పురోగతులు వచ్చినప్పటికీ, ఈ వ్యాధిని కచ్చితంగా ముందుగానే గుర్తించే నమ్మకమైన పరీక్ష ఇప్పటికీ అందుబాటులో లేదు. అందుకే మహిళలు తమకు ఉన్న ప్రమాద కారకాలు, ప్రధాన లక్షణాల గురించి తెలుసుకోవడం చాలా ముఖ్యమని నిపుణులు సూచిస్తున్నారు. వీటి గురించి అవగాహన ఉంటే అనుమానాస్పద లక్షణాలను త్వరగా గుర్తించి, వీలైనంత త్వరగా వైద్య పరీక్షలు చేయించుకోవచ్చు.క్యాన్సర్ పరీక్షలు చేయించుకోండి.వయసు పెరగడం అండాశయ క్యాన్సర్‌కు ముఖ్యమైన ప్రమాద కారకాల్లో ఒకటి. ముఖ్యంగా 50 నుంచి 79 ఏళ్ల మధ్య వయసున్న మహిళల్లో ఈ ప్రమాదం ఎక్కువగా ఉంటోంది. కుటుంబంలో అండాశయ, రొమ్ము, గర్భాశయ లోపలి పొర, పెద్దపేగు క్యాన్సర్ల చరిత్ర ఉన్నా ప్రమాదం పెరుగుతుంది. అలాగే కుటుంబంలో లేదా వ్యక్తిగతంగా బీఆర్‌సీఏ జన్యు మార్పులు ఉండడం కూడా ముఖ్యమైన ప్రమాద కారకమే. పిల్లలు లేకపోవడం, హార్మోన్ చికిత్స తీసుకోవడం, ఎండోమెట్రియోసిస్ వంటి పరిస్థితులు కూడా అండాశయ క్యాన్సర్ ప్రమాదంతో సంబంధం కలిగి ఉంటాయి. అండాశయ క్యాన్సర్‌కు సంబంధించిన కొన్ని లక్షణాలను మహిళలు సాధారణ జీర్ణక్రియ సమస్యలుగా భావించి నిర్లక్ష్యం చేసే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా తగ్గకుండా కొనసాగుతున్న పొత్తికడుపు ఉబ్బరం, తినడంలో ఇబ్బంది, కొద్దిగా తిన్నా త్వరగా కడుపు నిండినట్లు అనిపించడం, పొత్తికడుపు లేదా కటి ప్రాంతంలో నొప్పి, మూత్రానికి సంబంధించిన మార్పులు వంటి లక్షణాలను గమనించాలి. అండాశయ క్యాన్సర్‌ను పూర్తిగా నివారించేందుకు హామీ ఇచ్చే మార్గం ప్రస్తుతం లేదు. అయితే కొన్ని జీవనశైలి మార్పులు, పునరుత్పత్తికి సంబంధించిన అంశాలు, వైద్యపరమైన జాగ్రత్తలు వ్యాధి ప్రమాదాన్ని కొంత వరకు తగ్గించడంలో సహాయపడతాయి. అలాగే వ్యక్తిగతంగా తమకు ఉన్న ప్రమాద కారకాలను తెలుసుకోవడం ద్వారా అధిక ప్రమాదంలో ఉన్న మహిళలను ముందుగానే గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకోవచ్చు.

పిల్లలకు జన్మనిచ్చి, వారికి తల్లిపాలు ఇచ్చిన మహిళల్లో అండాశయ క్యాన్సర్ ప్రమాదం తక్కువగా ఉంటుందని అనేక అధ్యయనాలు సూచించాయి. కొన్ని హార్మోన్, పునరుత్పత్తికి సంబంధించిన అంశాలు కూడా అండాశయ క్యాన్సర్ ప్రమాదంతో సంబంధం కలిగి ఉంటాయి. అందువల్ల మహిళలు తమ పునరుత్పత్తి, రుతుక్రమ చరిత్రను వైద్యులతో చర్చించడం ద్వారా తమకు ఉన్న మొత్తం ప్రమాదాన్ని అంచనా వేసుకోవచ్చు. ఆరోగ్యకరమైన జీవనశైలిని పాటించడం కూడా ప్రమాదాన్ని తగ్గించడంలో ముఖ్యమైన భాగం. పండ్లు, కూరగాయలు, సంపూర్ణ ధాన్యాలు, కొవ్వు తక్కువగా ఉండే ప్రొటీన్ పదార్థాలతో కూడిన సమతుల ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన బరువును కొనసాగించవచ్చు. శరీరానికి అవసరమైన పోషకాలు అందేలా చూసుకోవడంతోపాటు, అధికంగా ప్రాసెస్ ఆహార పదార్థాలు, మాంసం తీసుకోవడాన్ని తగ్గించడం మంచిది. క్రమం తప్పకుండా శారీరక వ్యాయామం చేయడం కూడా ఆరోగ్యకరమైన బరువును కొనసాగించేందుకు, మొత్తం ఆరోగ్యాన్ని మెరుగుపరచేందుకు సహాయపడుతుంది. కుటుంబంలో అండాశయ, రొమ్ము, గర్భాశయ లోపలి పొర లేదా పెద్దపేగు క్యాన్సర్ చరిత్ర ఉన్న మహిళలు తమ వైద్యులతో తప్పనిసరిగా చర్చించాలి.

# వాక్, యోగ.. రెండూ.. ఆరోగ్యానికి మేలు..!

**జై భీమ్ న్యూస్, ఆరోగ్యం:**

వ్యాయామం అనగానే ఠక్కున గుర్తుకొచ్చేవి.. వాకింగ్, యోగ! పిల్లలు మొదలుకొని పెద్దల వరకూ ప్రతి ఒక్కరూ చేయగలుగుతారు. అయితే, ఈ రెండిటిలో ఏది మన ఆరోగ్యానికి ఎక్కువ మేలు చేస్తుంది? ఎలాంటి సమస్యలు ఉన్నవారు ఏది ఎంచుకోవాలి? అనే ప్రశ్నలకు నిపుణులు సమాధానాలు ఇస్తున్నారు.మార్నింగ్ వాక్, యోగ.. రెండూ ఆరోగ్యానికి మేలు చేసేవే! అయితే, ఈ రెండిటి వల్ల కలిగే ప్రయోజనాలు, శరీరంపై చూపించే ప్రభావాలు మాత్రం వేర్వేరుగా ఉంటాయి. కాబట్టి, మీ శరీర అవసరాలు, ఆరోగ్యం, ఆశయాలను బట్టి ఏది ఎంచుకోవాలో నిర్ణయించుకోవచ్చు.ఇది అద్భుతమైన కార్డియో వ్యాయామం. శరీరాన్ని చురుగ్గా ఉంచడానికి.. నడక అనేది చాలా తేలికైన, ప్రభావవంతమైన మార్గం కూడా. మార్నింగ్ వాక్ వల్ల రక్త ప్రసరణ మెరుగుపడుతుంది. రక్త పోటు నియంత్రణలో ఉంటుంది. కొలెస్ట్రాల్ తగ్గుతుంది. కేలరీలు వేగంగా కరిగిపోతాయి. కాబట్టి, బరువు తగ్గాలనుకునే వారికి వాకింగ్ బాగా ఉపయోగపడుతుంది. అంతే కాదు, ఊపిరితిత్తుల సామర్థ్యం పెరిగి, రోజంతా ఉత్సాహంగా ఉండటానికి సహాయపడుతుంది. టైప్-2 మధుమేహం ఉన్న వారు మార్నింగ్ వాక్ చేస్తే.. ఇన్సులిన్ నిరోధకత పెరుగుతుంది. ఉదయాన్నే స్వచ్ఛమైన గాలి పీల్చడం వల్ల ఒత్తిడి, ఆందోళన తగ్గి మూడ్ మెరుగుపడుతుంది.యోగాభ్యాసం అంటే.. ఒక వ్యాయామం మాత్రమే కాదు. అది శరీరం, మనసు, శ్వాసల కలయిక. యోగాసనాల వల్ల కండరాలు, నరాలు సాగి.. శరీరం సరళంగా, చురుగ్గా తయారవుతుంది. జీవనశైలి లోపాల వల్ల వచ్చే నడుము నొప్పి, మెడ నొప్పి, కీళ్ల నొప్పుల నుంచి ఉపశమనం లభిస్తుంది. ప్రాణాయామం, ధ్యానం వల్ల ఒత్తిడి, ఆందోళన పూర్తిగా తగ్గి, ఏకాగ్రత, నిద్ర లేమి సమస్యలు దూరమవుతాయి. వివిధ ఆసనాలు వేయడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది. హార్మోన్ల సమతుల్యత సాధ్యమవుతుంది. నిటారుగా కూర్చోవడం, నిలబడటంలో శరీర ఆకృతి



మెరుగుపడుతుంది.బరువు తగ్గడం, గుండె ఆరోగ్యం, రక్తపోటు-షుగర్ నియంత్రణలో ఉంచుకోవడం మీ ప్రధాన లక్ష్యమైతే.. మార్నింగ్ వాక్ ఎంచుకోవడం మంచిది. ఇక ఒత్తిడి, శారీరక నొప్పుల నుంచి ఉపశమనం, ఫ్లెక్సిబిలిటీ, ప్రశాంతత కావాలనుకుంటే.. యోగాను ఆశ్రయించాలి. వీలైతే.. వారంలో మూడు నాలుగు రోజులు మార్నింగ్ వాక్, మిగతా రోజులు యోగా చేయడం అలవాటు చేసుకోవాలి. ఇంకా మెరుగైన ఫలితాలు కావాలనుకుంటే.. ఉదయం 15-20 నిమిషాలు వాకింగ్ చేసి, మరో 15 నిమిషాలు తేలికపాటి యోగాసనాలు వేస్తే సరిపోతుంది.

# విటమిన్ డి శరీరానికి.. అవసరమైన ముఖ్యం

**జై భీమ్ న్యూస్, ఆరోగ్యం:**

విటమిన్ డి శరీరానికి అవసరమైన ముఖ్యమైన పోషకాల్లో ఒకటి. ఎముకల ఆరోగ్యంతోపాటు గుండె, రక్తనాళాల పనితీరులోనూ ఇది కీలక పాత్ర పోషిస్తుంది. దీంతో చాలా మంది వైద్యుల సలహాతో లేదా సొంతంగా విటమిన్ డి సప్లిమెంట్లను తీసుకుంటున్నారు. అయితే రక్తపోటు నియంత్రణ కోసం రోజూ మందులు వాడేవారు విటమిన్ డి సప్లిమెంట్లను తీసుకునే ముందు కొన్ని విషయాల్లో జాగ్రత్తగా ఉండాలి. ముఖ్యంగా కొన్ని రకాల రక్తపోటు మందులతో అధిక మోతాదులో విటమిన్ డి తీసుకోవడం వల్ల సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుంది. విటమిన్ డి శరీరంలోని రక్తనాళాల పని తీరు, రక్తనాళాల గోడల సడలింపు, రక్తపోటును నియంత్రించే రెనిన్-యాంజియో టెన్సిన్-ఆల్డోస్టెరాన్ వ్యవస్థపై ప్రభావం చూపుతుంది. శరీరంలో విటమిన్ డి తగిన స్థాయిలో ఉండడం వల్ల రక్తనాళాలు సడలేందుకు, రక్తనాళాల పనితీరు మెరుగు పడేందుకు, వాటి దృఢత్వం తగ్గేందుకు సహాయపడుతుంది. విటమిన్ డి లోపం ఉన్నవారిలో దాన్ని సరిచేయడం వల్ల రక్తపోటు నియంత్రణకు కూడా కొంత ప్రయోజనం కలుగుతుంది.రక్తపోటు మందులతో కలిపి తీసుకుంటే.. అయితే విటమిన్ డిని రక్తపోటు మందులతో కలిపి తీసుకున్నప్పుడు దాని ప్రభావం మందు రకాన్ని బట్టి మారుతుంది. ముఖ్యంగా థయజైడ్ తరహా మూత్రవిసర్జన మందులు వాడేవారు జాగ్రత్తగా ఉండాలి. హైడ్రోక్లోరోథయజైడ్, క్లోర్తాలిడోన్ వంటి మందులు మూత్రం ద్వారా సోడియం, నీటిని బయటకు పంపడమే కాకుండా శరీరం నుంచి కాల్షియం బయటకు వెళ్లడాన్ని కూడా తగ్గిస్తాయి. మరోవైపు అధిక మోతాదులో విటమిన్ డి తీసుకుంటే పేగుల ద్వారా కాల్షియం శోషణ పెరుగుతుంది. ఈ రెండూ కలిసి రక్తంలో కాల్షియం స్థాయిలు అధికమయ్యే అవకాశం ఉంటుంది. రక్తంలో కాల్షియం ఎక్కువైతే వికారం, అలసట, తరచూ మూత్రం రావడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. పరిస్థితి తీవ్రమైతే మూత్రపిండాలపై ఒత్తిడి పెరగడం లేదా గుండె స్పందనలో



అసాధారణ మార్పులు కూడా వస్తాయి. అందుకే థయజైడ్ తరహా రక్తపోటు మందులు తీసుకునే వారు అధిక మోతాదులో విటమిన్ డి సప్లిమెంట్లను వైద్యుల సూచన లేకుండా తీసుకోకూడదు. అమ్లోడిపిన్, నిఫెడిపిన్ వంటి కాల్షియం ఛానల్ నిరోధక మందులతో సాధారణ మోతాదులో విటమిన్ డి తీసుకోవడం వల్ల సాధారణంగా పెద్దగా సమస్యలు ఉండవు. అయితే చాలా అధిక మోతాదులో విటమిన్ డి తీసుకోవడం వల్ల రక్తంలో కాల్షియం స్థాయిలు పెరిగే అవకాశం ఉంటుంది. ఇది రక్తనాళాల కండరాల స్పందనపై ప్రభావం చూపే అవకాశం ఉన్నందున ఇలాంటి మందులు వాడుతున్న వారు కూడా అధిక మోతాదులో విటమిన్ డి తీసుకునే ముందు వైద్యుల సలహా తీసుకోవడం మంచిది.లిసినోప్రిల్ వంటి ఏసీఈ నిరోధకాలు, టెల్మిసార్టాన్ వంటి ఏఆర్బీ మందులు రక్తనాళాలను సడలించడం ద్వారా రక్తపోటును తగ్గించడంలో సహాయ పడతాయి. విటమిన్ డి కూడా రక్తపోటు నియంత్రణకు సంబంధించిన రెనిన్ వ్యవస్థపై ప్రభావం చూపుతుంది.

దీంతో కొన్ని సందర్భాల్లో విటమిన్ డి, ఈ మందులు కలిసి రక్తపోటు నియంత్రణకు అదనపు ప్రయోజనం అందించే అవకాశం ఉంటుంది. అయితే దీనిని దృష్టిలో ఉంచుకుని ఎవరూ సొంతంగా విటమిన్ డి మోతాదును పెంచకూడదు. విటమిన్ డి అధికంగా తీసుకోవడం వల్ల కలిగే సమస్యలు అరుదుగానే కనిపించినప్పటికీ, ఎక్కువ మోతాదులో సప్లిమెంట్లు తీసుకునే వారు అప్రమత్తంగా ఉండాలి. ముఖ్యంగా వారానికి 60,000 అంతర్జాతీయ యూనిట్ల వంటి అధిక మోతాదులను వైద్యుల పర్యవేక్షణ లేకుండా తీసుకోవడం వల్ల సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుంది. కండరాల బలహీనత, నిరంతర అలసట, అధిక దాహం, తరచూ మూత్రం రావడం, వికారం, ఆకలి తగ్గడం, మల బద్ధకం వంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకూడదు. కొందరిలో తల తిరగడం లేదా రక్తపోటులో అనూహ్యమైన మార్పులు కూడా కనిపిస్తాయి.అధిక మోతాదులో విటమిన్ డి సప్లిమెంట్లు ప్రారంభించే ముందు రక్తంలో 25-హైడ్రాక్సీ విటమిన్ డి, కాల్షియం స్థాయిలను పరీక్షించుకోవడం ఉపయోగకరంగా ఉంటుంది. ముఖ్యంగా రక్తపోటు మందులను రోజూ తీసుకునే వారు ఈ పరీక్షల విషయంలో వైద్యుల సూచన పాటించాలి. సప్లిమెంట్ తీసుకున్న తర్వాత స్వల్పంగా కడుపులో అసౌకర్యం వంటి సమస్యలు ఎదురైతే మందులు, సప్లిమెంట్ తీసుకునే సమయాన్ని మార్చాలా అనే విషయాన్ని వైద్యులను అడగాలి. కొత్తగా విటమిన్ డి సప్లిమెంట్ ప్రారంభించినప్పుడు ఇంట్లో రక్తపోటును క్రమం తప్పకుండా కొలిచి నమోదు చేసుకోవడం కూడా ఉపయోగకరంగా ఉంటుంది. ముఖ్యంగా వైద్యుల సలహా లేకుండా అధిక మోతాదులో విటమిన్ డి తీసుకోవడం మంచిది కాదు. సాధారణ రోజువారీ మోతాదును మాత్రమే తీసుకోవాలి. లోపం నిర్ధారణ అయినప్పుడు మాత్రమే వైద్యులు సూచించిన చికిత్సా మోతాదులను తీసుకోవాలి. రక్తపోటు మందులు వాడుతున్న వారు విటమిన్ డి సప్లిమెంట్లను ప్రారంభించే ముందు తమ వైద్యుడికి సమాచారం ఇవ్వడం ద్వారా అనవసరమైన సమస్యలను నివారించవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.